వివేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :181 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 16 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

రైతాంగంపై తీవ్ర ప్రభావం



- మురసు దెబ్బకు రూ.2,484 కోట్ల నష్టం!
- తక్షణ సాయం అందించండి..
- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి
- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- 1.86 లక్షల మంది రైతులకు నష్టం
- 1,385 కిలోమీటర్ల రహదారులు ధ్వంసం
- 60 ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

అమరావతి

మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని, రాష్ట్రానికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తుపాను వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం సీఎం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన పంట, ఆస్తి నష్టాల వివరాలను వెల్లడించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం తుపాను కారణంగా రాష్ట్రానికి రూ.2,484 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావం కారణంగా వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు వివరించారు. వ్యవసాయ రంగంలో 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. వీటివల్ల సుమారు రూ.875 కోట్ల మేర -

వివరాలు 4లో..



మోదీపై అవినీతి మరక లేదు!

- కాంగ్రెస్‌పై అమిత్‌షా నిప్పులు..
- 12 లక్షల కోట్ల కుంభకోణాలంటూ ఆరోపణలు
- 12 ఏళ్ల పాలనలో నాలుగు అణాల అవినీతి ఆరోపణ కూడా లేదు
- రాహుల్‌కు అధికారం కావాలంటే గ్రామాల్లో పర్యటించాలి
- భారత్ సమిట్ వ్యాఖ్యలపై బీజేపీ--కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



పట్టణ పోరుకు టీడీపీ అభ్యర్థుల ఖరారు

మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటన!

మంగళగిరి--తాడేపల్లి మేయర్‌గా పేరం ఏడుకొండలు

10 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు అభ్యర్థుల వెల్లడి

నవంబర్ 26న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలుగుదేశం పార్టీ ఎన్నికల కసరత్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ఖరారు చేసింది. కీలకమైన మంగళగిరి--తాడేపల్లి నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలును ఎంపిక చేసింది.

మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థులు వీరే..

టీడీపీ ప్రకటించిన మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితాలో పది మంది పేర్లు ఉన్నాయి.

తణుకు: బసవ రామకృష్ణ, పాలకొల్లు: ఆబోతుల ఉషారాణి


నరసరావుపేట: ఎన్. రూపేశ్ గుప్తా, గుడివాడ: మారీదు కరుణ

శ్రీకాళహస్తి: పేట బాలాజీ, తాడిగడప: పీతా గోపీచంద్

వివరాలు 4లో..

ఏపీ, ఒడిశాలకు తుపాను హెచ్చరికలు జారీ..

- బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనున్న వాయుగుండం
- గురువారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకునే అవకాశం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాల సూచన
- కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక





శ్రీవారి భక్తులకు ఎస్వీ మ్యూజియం ఎంట్రీ

- ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ'
- లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక ఎస్వీ మ్యూజియం
- టీసీఎస్ సాంకేతిక సహకారంతో 14 ప్రత్యేక గ్యాలరీలు
- నవంబర్ 16 నుంచి సాధారణ భక్తులకు సందర్శన అవకాశం
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి
- ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలు మాత్రమే



అయ్యప్ప భక్తులకు శుభవార్త..

తెలుగు రాష్ట్రాల నుంచి కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

నెహ్రూ వారసత్వాన్ని చెరిపేయడం సాధ్యం కాదు!

- బీజేపీ, ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ ధ్వజం
- నెహ్రూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- వాస్తవాలు, విజ్ఞానంతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ప్రధాని మోదీనే అతిపెద్ద చరిత్ర వక్రీకర్త.. జైరాం రమేశ్ వ్యాఖ్యలు





పట్టణ ఎన్నికల బరిలో జనసేన..

మేయర్, ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేసిన పవన్!

శ్రీకాకుళం, కాకినాడ మేయర్ అభ్యర్థులుగా మహిళా నేతలు

రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటన

క్షేత్రస్థాయి సమీక్షల అనంతరం అభ్యర్థుల ఎంపిక

బలపడుతున్న వాయుగుండం



- 19 నుంచి అతి భారీ వర్షాలు!
- ఉత్తర దిశగా గంటకు 10 కి.మీ. వేగంతో పయనం
- 17 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- 19 నుంచి కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు
- కళింగపట్నం మినహా అన్ని పోర్టులకు హెచ్చరిక
- రాడార్లతో తుపాను కదలికలపై నిరంతర నిఘా
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి మరోసారి తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అప్రమత్తమైంది. ఏపీతో పాటు దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 19 నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం

వివరాలు 4లో..

రైతాంగంపై తీవ్ర ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

పంట నష్టం సంభవించినట్లు వెల్లడించారు. ఉద్యాన పంటలకూ భారీ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

1,385 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. సుమారు 1,385 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వ నివేదికలో పేర్కొన్నారు. ఆకస్మిక వరదల కారణంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం వెల్లడించింది.

విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం

తుపాను ప్రభావంతో విద్యుత్ రంగంలోనూ తీవ్ర నష్టం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 10,192 హెచ్‌టీ (11 కేవీ) స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా 3,859 ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలో వివరించింది.

ఉద్యాన పంటలకు రూ.337 కోట్ల నష్టం

ఉద్యాన రంగంలో 6,756 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు రూ.337 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మామిడి, బొప్పాయి వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం తెలిపింది. పత్తి రైతుల్లో చాలామంది అధిక బీమా



ప్రీమియం కారణంగా పంటల బీమా చేయించుకోలేకపోయారని పేర్కొంది.

60 ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించింది. సుమారు 60 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించింది. చీరాల, బాపట్ల, పర్చూరు, చిలకలూరిపేట, సూరప్పగూడెం, నిడమర్రు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు, కాలువలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థను పరిశీలించింది. మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని కూడా అంచనా వేసింది. బాధిత రైతులు, మత్స్యకారులతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించింది.

వరి పంటకు 90 శాతం వరకు నష్టం

కేంద్ర బృందం పరిశీలనలో తూర్పుగోదావరి జిల్లాలో వరి పంటకు 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు నష్టం జరిగినట్లు గుర్తించింది. గతంలో వచ్చిన అర్నబ్ తుపానుతో పోలిస్తే మురసు తుపాను ప్రభావం కొన్ని ప్రాంతాల్లో అధికంగా ఉందని వివరించింది. అయితే ప్రభుత్వం ముందస్తుగా కాలువలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల వరద నష్టం తీవ్రత కొంతమేర తగ్గిందని పేర్కొంది.

బాధితులకు అదనపు సాయం అందించాలి

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అధిక పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది. తుపాను బాధిత కుటుంబాలకు నెల రోజుల్లో మూడుసార్లు రేషన్ పంపిణీ చేయడం, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు అందించడం, గిరిజనులకు ప్రత్యేక సాయం కల్పించడం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని తెలిపింది.

శాశ్వత పరిష్కారానికి కేంద్ర సహకారం

కోస్తాంధ్రకు తరచూ తుపాన్ల ముప్పు ఎదురవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేలా మౌలిక వసతులను బలోపేతం చేయాలని చంద్రబాబు కోరారు. రహదారులు, విద్యుత్ వ్యవస్థ, సాగునీటి కాలువలు, ఇతర కీలక వసతుల పునరుద్ధరణకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలతో త్వరగా సమగ్ర నివేదిక సమర్పించి రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందేలా చూడాలని కేంద్ర బృందానికి సూచించారు.

పోలవరం ముంపు ఎఫెక్ట్
మారనున్న మల్కన్‌గిరి-భద్రాచలం రైల్వే రూట్

ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా మీదుగా తెలంగాణలో భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న కొత్త రైల్వేలైన్‌లో కొంత భాగం పోలవరం జలాశయ ముంపు ప్రాంత పరిధిలో ఉన్నట్లు తేలింది. దీంతో ఎలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, పాండురంగాపురం వరకు సుమారు 173.61 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్‌ను రైల్వే శాఖ ఇటీవల మంజూరు చేసింది. ఇందులో ఒడిశా పరిధిలో మల్కన్‌గిరి, బడలి, పనిమట రాజన్‌గూడ, లచ్చిపేట, కందపల్లి, మోటు స్టేషన్లు నిర్మిస్తారు. ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా పరిధిలో కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు వస్తాయి. తెలంగాణలో భద్రాచలం, సారపాక స్టేషన్ల మీదుగా ఈ లైన్ వెళ్తుంది. చివరగా పాండురంగాపురం స్టేషన్ వద్ద ప్రస్తుతమున్న డోర్నకల్-భద్రాచలం రోడ్-మణుగూరు రైల్వే లైన్‌లో ఈ కొత్త మార్గం కలుస్తుంది.

భూసేకరణ వేళ ముంపు గుర్తింపు

ఈ రైల్వే లైన్ ఆంధ్రప్రదేశ్?లోని పోలవరం జిల్లా పరిధిలో ఉన్న చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ఏకంగా 65 కిలోమీటర్ల మేర సాగుతుంది. ఈ పరిధిలోనే కుయుగూరు, సీతారామపురం, భీమవరం, రాజుపేట స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే భూసేకరణ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఇదంతా పోలవరం ముంపు పరిధిలోకి వస్తుందని గుర్తించారు. దీంతో అత్యధిక భాగం ముంపునకు గురవుతుందని వారు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారుల సమాచారంతో రైల్వే అధికారులు



పోలవరం కలెక్టర్‌తో పలు దఫాలు చర్చలు జరిపారు. ముంపు దృష్ట్యా ఇప్పటికే ప్రతిపాదించిన మార్గంలో లైన్ వేయడం సాధ్యం కాదని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఎలైన్‌మెంట్‌ను మార్చేలా మళ్లీ క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. పోలవరం ముంపు ఏయే గ్రామాల వరకు ఉందనేది పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ ముంపు ప్రాంతానికి ఎగువన ఎటువైపు నుంచి లైన్ వేయొచ్చో పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఆ వివరాలను త్వరలోనే రైల్వే బోర్డుకు పంపనున్నారు.

తొలుత ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2,864 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు పోలవరం జిల్లాలో ఎలైన్‌మెంట్ మారుతుండటంతో ముందుగా అనుకున్న స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మించాల్సి వస్తుంది. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని చోట్ల టన్నెల్స్ (సొరంగాలు) కూడా నిర్మించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి అత్యధికంగా అటవీ భూములే అవసరం కానున్నాయి.

అల్లూరి జిల్లాకు పర్యాటకుల క్యూ
ఆతిథ్యానికి అటవీ శాఖ రెడీ

చలికాలం వచ్చేసింది. మంచు సోయగాలను ఆస్వాదించేందుకు అల్లూరి జిల్లాకు పర్యాటకుల రాక మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఏజెన్సీలో పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో సందర్శకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ సన్నద్ధమైంది. ఇప్పటివరకు అడవుల పరిరక్షణకే పరిమితమైన అటవీ శాఖ, ఇకపై మన్యానికి వచ్చే టూరిస్ట్?లకు స్వయంగా అతిథి మర్యాదలు చేయనుంది. ఈ మేరకు సందర్శకులకు వసతులు కల్పించేలా చింతపల్లి అటవీ డివిజన్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టులను లాంఛనంగా ప్రారంభించింది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చేలా సర్వం సిద్ధం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం మన్యంలో పర్యాటకాన్ని పెంపొందించేలా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే చింతపల్లి రేంజ్ పరిధిలోని కృష్ణాపురం పైనస్ తోటల్లో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.60 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో ఇప్పటికే అడవిలో పలు సదుపాయాలు కల్పించారు. దీనికి తోడు తాజాగా ఇక్కడ 'వనవిహారి' ప్రాజెక్టు పేరిట అదనంగా మరో రూ.70 లక్షలు విడుదల చేసింది. సందర్శకులు బస చేసేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో కూడిన మూడు టెంటెడ్ కాటేజీలను సిద్ధం చేశారు. వీటితో పాటు పైనస్ తోటల్లో ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేశారు.

ఆటవిడుపు కోసం ప్రత్యేక పార్కులు

కుటుంబాలతో సహా వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా అటవీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. పిల్లలు ఆడుకునేందుకు 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా' పేరిట ప్రత్యేకంగా ఓ పార్కును



నిర్మించింది. ఇందులో ఊయలలు, జారుడు బల్లలు తదితర ఆటవస్తువులను సమకూర్చారు. సందర్శకులకు ఆటవిడుపుగా ఉండేందుకు ఆర్చరీ లాంటి క్రీడలతో అడ్వంచర్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. మన్యంలో లభించే చిరుధాన్యాలు, స్థానిక రుచులతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందించేలా ప్రత్యేకంగా ఆహారశాలను నిర్మించారు. టూరిస్ట్?లు ఫొటోలు దిగేందుకు వీలుగా ప్రత్యేక సెట్టింగులు ఏర్పాటు చేశారు.

చింతపల్లి అటవీ శాఖ పరిధిలోని కృష్ణాపురంలో పైనస్ వృక్షాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. చలికాలంలో ఈ వృక్షాల పద్ద ఉదయం పూట దట్టంగా మంచు అలుముకుంటుంది. ఈ ప్రకృతి సోయగం చూపరులను అమితంగా ఆకట్టుకుంటుంది. మంచు అందాలను ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడ ఆగి ఫొటోలు దిగుతుంటారు. అందుకే అతిథి పర్యాటకం ప్రాజెక్టుకు పైనస్ వృక్షాలున్న కృష్ణాపురాన్నే అటవీ శాఖ ఎంపిక చేసింది. పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా పూర్తిగా సహజసిద్ధ వనరులతోనే ఇక్కడ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

ఈ ఏడాది దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని డీఎఫ్ఓ నరసింహారావు తెలిపారు. వనవిహారి ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కేరళలో ప్రాచుర్యం పొందిన సెమీ పర్మినెంట్ కాటేజీలను ఇక్కడ మూడు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిల్లో డబుల్ బెడ్‌రూం, లివింగ్, డ్రస్సింగ్, వాషింగ్ రూం, అత్యాధునిక మరుగుదొడ్లు ఉంటాయన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్ పార్క్, సాహస క్రీడల కోసం అడ్వంచర్ పార్క్‌తో పాటు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ కూడా సిద్ధం చేశామని నరసింహారావు వెల్లడించారు.

పట్టణ పోరుకు టీడీపీ అభ్యర్థుల ఖరారు..

-మొదటిపేజీ తరువాయి

పొన్నూరు: కంద్రు విజయలక్ష్మి
కందుకూరు: పిడికిటి వెంకటేశ్వర్లు
ఆమదాలవలస: కూన ప్రమీల
గూడూరు: చౌటూరి శిరీష

నగర పంచాయతీలకు అభ్యర్థుల ప్రకటన

నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులుగా సలుగురిని పార్టీ ఖరారు చేసింది.
చింతలపూడి: కె. ఎస్తేర్ రాణి
పొదిలి: వరికుంట్ల అనిల్ కుమార్
అల్లూరు: తోటకూర సునీల్ కుమార్
బి. కొత్తకోట: కుడుము శ్రీనివాసులు
23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు
రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో నాలుగు కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

కూటమి పార్టీల్లో ఎన్నికల సందడి

ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం కూడా తమ అభ్యర్థుల పేర్లను ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

పట్టణ ఎన్నికల బరిలో జనసేన..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవులకు, మూడు మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

రెండు కార్పొరేషన్లకు మహిళా అభ్యర్థులు

శ్రీకాకుళం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ పదవులకు జనసేన మహిళా నేతలకు అవకాశం కల్పించింది.
- శ్రీకాకుళం: డాక్టర్ దానేటి రాధారాణి
- కాకినాడ: ఆకుల భవాని
ఈ రెండు కీలక నగరాల్లో మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా పార్టీ నాయకత్వం వారికి ప్రాధాన్యత ఇచ్చింది.
మూడు మున్సిపాలిటీలకు అభ్యర్థులు
మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల వివరాలను కూడా పార్టీ వెల్లడించింది.
- రాజాం: బనిశెట్టి సౌజన్య లత
- భీమవరం: డాక్టర్ చుండూరి మల్లేశ్వరి
- తాడేపల్లిగూడెం: పాలూరు వెంకటేశ్వరరావు

సమీక్షల అనంతరం ఎంపిక

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నాయకులను బరిలోకి దించాలనే లక్ష్యంతో జనసేన నాయకత్వం కసరత్తు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించడంతో పాటు పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పవన్ కల్యాణ్ అభ్యర్థులను ఖరారు చేసినట్లు పేర్కొన్నాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో జనసేన శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి.

నవంబర్ 26న పోలింగ్

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరగకుండా మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ విడతలో మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నాలుగు కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. నవంబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే బీజేపీ కూడా తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా జనసేన అభ్యర్థుల ప్రకటనతో కూటమి పార్టీల ఎన్నికల సన్నాహాలు మరింత ఊపందుకున్నాయి.

బలపడుతున్న వాయుగుండం



-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతోంది. ఇది గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1,010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1,130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తీవ్ర తుపానుగా మారే అవకాశం

వాయుగుండం దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే సూచనలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అనంతరం మరో రెండు రోజుల్లో మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశముందని పేర్కొంటున్నారు.

19 నుంచి భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో ఈ నెల 19వ తేదీ నుంచి కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు సమోదయ్యే పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

పోర్టులకు నంబర్-1 హెచ్చరిక

తుపాను ముప్పు నేపథ్యంలో కళింగపట్నం మినహా రాష్ట్రంలోని అన్ని పోర్టులకు నంబర్-1 ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లే విషయంలో అధికారుల సూచనలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

రాడార్లతో నిరంతర పర్యవేక్షణ

వాయుగుండం కదలికలు, దిశ, తీవ్రతలో వస్తున్న మార్పులను వాతావరణ శాఖ అధికారులు వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నారు. తుపాను గమనం, తీరం దాటే ప్రాంతం, తీవ్రతపై తదుపరి బులెటిన్లలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వాతావరణ శాఖ తాజా అంచనా

నవంబర్ 15న విడుదల చేసిన ఐఎండీ బులెటిన్ ప్రకారం ఈ వ్యవస్థ నవంబర్ 16న తుపానుగా, 17న తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. అనంతరం ఆంధ్రప్రదేశ్ తీరం దిశగా కదలవచ్చని అంచనా వేసింది. అయితే తుపాను తీరం దాటే ప్రాంతం, సమయం ఇంకా ఖరారు కాలేదు.

ప్రజలకు సూచన: తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు అధికారిక సూచనలు తప్పనిసరిగా పాటించాలి. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

పోతుకుంట సర్పంచ్ బరిలో టీడీపీ అభ్యర్థి తలారి వెంకటలక్ష్మి





- తొలిరోజే భారీ ఉత్సాహంతో నామినేషన్ దాఖలు
- అభ్యర్థికి మద్దతుగా హాజరైన బీజేపీ పోతుకుంట ఎంపీటీసీ అంగజాల రాజు



ధర్మవరం,నవంబర్ 15 (పెన్ సత్తా)శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం పోతుకుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోరుకు తెలుగుదేశం పార్టీ తరఫున తలారి వెంకటలక్ష్మి శ్రీకారం చుట్టారు.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే సర్పంచ్ అభ్యర్థిగా ఆమె ధర్మవరం ఎంపీడీవో కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు.

ఎన్నికల తొలి రోజే నామినేషన్ దాఖలు చేయడంతో పోతుకుంట గ్రామంలో రాజకీయ సందడి మొదలైంది.ఈ సందర్భంగా పోతుకుంట బీజేపీ ఎంపీటీసీ అంగజాల రాజు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని తలారి వెంకటలక్ష్మికి మద్దతు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తొలి రోజే నామినేషన్ దాఖలు కావడంతో పోతుకుంటలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. రానున్న రోజుల్లో గ్రామంలో రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.ఈ కార్యక్రమంలో రవి,రాము, నారాయణస్వామి, మారుతి,తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం చేనేత డిజైనర్ జూజారే నాగరాజుకు జాతీయ పురస్కారం..

- హైదరాబాద్‌లో 'స్వకులశాలి భూషణ్' అవార్డు అందుకున్న నాగరాజు..
- ధర్మవరం చేనేత ఖ్యాతిని జాతీయస్థాయికి తీసుకెళ్లిన డిజైనర్‌కు అభినందనలు..

ధర్మవరం,నవంబర్ 15 (పెన్ సత్తా) చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ చేనేత డిజైనర్ జూజారే నాగరాజు మరోసారి జాతీయస్థాయి గుర్తింపు పొందారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన స్వకులశాలి చేనేత సంఘం 14వ జాతీయ మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన 'స్వకులశాలి భూషణ్' జాతీయ పురస్కారాన్ని ప్రకటించారు.

తెలంగాణకు చెందిన ఎంపీ డీకే అరుణ, కాంబ్లె బాలాజీ, జూజారే నాగేష్ తదితరుల సమక్షంలో ఈ పురస్కార ప్రకటన జరిగింది.మహాసభల తొలిరోజు నిర్వహించిన స్వకులశాలీయుల శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విశ్వేశ్వర స్వామి చిత్రపటంతో పాటు చేనేత మగ్గాన్ని ఏర్పాటు చేసి, హైదరాబాద్ నగరంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.ఈ శోభాయాత్రలో ప్రత్యక్షంగా మగ్గంపై పట్టు శాలువాలను నేస్తూ ధర్మవరం చేనేత కళానైపుణ్యాన్ని జాతీయస్థాయిలో చాటిచెప్పారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి,ధర్మవరం చేనేత ఖ్యాతిని విస్తరించేందుకు విశేష కృషి చేస్తున్న జూజారే నాగరాజుకు జాతీయ పురస్కారం లభించడం పట్ల ధర్మవరం పట్టణంలోని చేనేత కార్మికులు, చేనేత వర్గాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కూటమి సర్పంచ్ అభ్యర్థిగా కూండ్రపు శ్రీరామమూర్తి నామినేషన్ దాఖలు.





పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 15:మండలం లోని నాయుడుపాలెం గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూండ్రపు శ్రీరామమూర్తి ఆదివారం భారీ ర్యాలీతో తరలివచ్చి పంచాయతీ కార్యాలయంలో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారికి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ నామినేషన్‌ను సర్పంచ్ అభ్యర్థిని పైల రమణారావు ప్రతిపాదించారు.ఈ సందర్భంగా నాయుడుపాలెం మాజీ సర్పంచ్ (లేటు) కూండ్రపు సన్యాసి నాయుడు తనయుడు రాజీవ్ అభ్యర్థి వెంట ఉండి నామినేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయించారు. అలాగే పంచాయతీ పరిధిలోని మొత్తం 12 వార్డులకు గాను, సర్పంచ్ అభ్యర్థి తరఫున 12 మంది వార్డు సభ్యులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.ఈ సందర్భంగా కూటమి సర్పంచ్ అభ్యర్థి కూండ్రపు శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పైల మహాలక్ష్మి, పైల అప్పల నాయుడు, పరవాడ మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు సన్యాసి నాయుడు, కె. గంగు నాయుడు, రాజన సత్యారావు, కూండ్రపు నరసింహమూర్తి, కూండ్రపు పంజాబ్ అప్పలనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కూండ్రపు కన్నంనాయుడు, కూండ్రపు తాతబాబు, కె. సన్నీ బాయ్, రొంగలి గంగరాజు, ఎమ్. అప్పలనాయుడు, కె. హరి, సి.హెచ్. ముత్యాలనాయుడు, వి. నర్సింహామూర్తి, కన్నూరు సత్యనారాయణ, పైల రమణకుమారి, కె. రామకృష్ణ తదితరులతో పాటు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు, పెద్దలు, అభిమానులు మరియు మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నమ్మకానికి నేరెడ్కో బ్రాండ్ కావాలి గంటా.







విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 15: వినియోగదారులకు చిక్కులు లేని ఆస్తులు అందించడం ద్వారా వారి నమ్మకాన్ని చూరగొనాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు సూచించారు. ఎంవీవీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ లో మూడు రోజులుగా జరుగుతున్న నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నేరెడ్కో) నార్త్ జోన్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. న్యాయ పరంగా ఎలాంటి చిక్కుల్లేని ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు అందించే బ్రాండ్ గా నేరెడ్కో ఎదగాలన్నారు. ఒకే గొడుగు కిందకు స్థిరాస్తి కొనుగోలు అవకాశాలను తీసుకువచ్చినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు. విశ్వ నగరంగా ఎదుగుతున్న విశాఖలో రియల్ ఎస్టేట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో వస్తున్న ఐటీ, టూరిజం ప్రాజెక్టులు వివరిస్తూ.. అందుకు తగ్గట్టు వ్యాపార అవకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రూ. 32 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. స్థిరాస్తి రంగం అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన స్టాళ్లను గంటా సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరాం, నేరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, కార్యదర్శి సుబ్బారావు, వైస్ చైర్మన్ హుస్సేన్, ప్రాపర్టీ షో చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించే హృదయం సంస్థ సేవలు అమోఘం

చిన్నారులకు ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ నమూనా పరీక్షలు





నక్కపల్లి, పెన్ సత్తా నవంబరు15:స్పందించే హృదయం సంస్థ అందించే సేవలు అమోఘం అని చిన దొడ్డిగల్లు హెచ్ ఎమ్ వి. బాలాజీ అన్నారు. ఈ సంస్థ ద్వారా గత కొంతకాలంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అయన పేర్కొన్నారు. ఆదివారం స్పందించే హృదయం సంస్థ ప్రతినిధులు ఎమ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నతపాఠశాలలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పోటీలను బాలాజీ పర్యవేక్షించారు.ఈ పరీక్షలకు పాయకరావుపేట,నక్కపల్లి,ఎస్.రాయవరం,కోటఉరట్ల మండలాలనుండి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ నమూనా పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన టాప్ 10 విద్యార్థులకు మరియు వివిధ పాఠశాల స్థాయిలో ప్రతిభ కన బరచిన మరొక 12 మందిని ఎంపిక చేసి ప్రశంసా పత్రములు, పతకాలు, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. హెచ్.ఎమ్.వి బాలాజీ మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వాహణ ద్వారా విద్యార్థులలో భయం తొలగించి జాతీయస్థాయి పరీక్షలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. పరీక్షా పద్ధతి,ప్రశ్నల సరళి,సమయపాలనపై పట్టు,సాధించవచ్చన్నారు.పోటీపరీక్షలపట్ల ఆత్మవిశ్వాసం కల్పించి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి ఇవి తోడ్పడతాయన్నారు. అనంతరం విజేతలకు వారి చేతులమీదుగా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు,వేంపాడు హైస్కూల్ పీడీ. ఏ.వీరబాబు, ఎన్. పైడిబాబు,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలి!

కూటమి ప్రభుత్వానికి యూటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ డిమాండ్



ధర్మవరం,నవంబర్ 15 (పెన్ సత్తా)కాంట్రిబ్యూషనరీ పెన్షన్ విధానం పరిధిలో ఉన్న డీఎస్సీ--2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని యూటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ స్వాగతించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.ఆదివారం ధర్మవరం పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి,జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ,ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

పాత పెన్షన్ విధానం సాధన కోసం యూటీఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు దశాబ్దాలుగా గ్రామస్థాయి నుంచి దేశ రాజధాని వరకు పోరాటాలు సాగించాయని గుర్తుచేశారు.ఈ పోరాటాల ఫలితంగానే మహారాష్ట్ర,ఒడిశా వంటి రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రంలోని సుమారు రెండు లక్షల మంది కాంట్రిబ్యూషనరీ పెన్షన్ విధానంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కే. భూతన్న, ఉపాధ్యక్షుడు జీహెచ్ బాబు,రాష్ట్ర మండలి సభ్యురాలు మేరీ వరకుమారి,జిల్లా కార్యదర్శులు మల్లికార్జున,అమర్ నారాయణరెడ్డి, నాగేంద్రమ్మ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్,మాజీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా లెక్కల పరిశీలన కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా దానేటి రాధారాణికి జనసేన టికెట్ ఖరారు.

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన రాధారాణి.



కోటబొమ్మాళి, పెన్ సత్తా, నవంబర్15:శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కూటమి తరఫున జనసేన పార్టీకి చెందిన దానేటి రాధారాణికి పార్టీ టికెట్ ఖరారు చేసింది. ఈ మేరకు జనసేన పార్టీ అధికారిక ప్రకటన వెలువడిన నేపథ్యంలో దానేటి రాధారాణి ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు దానేటి రాధారాణికి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాధారాణి భర్త డాక్టర్ దానేటి ,శ్రీధర్, జనసేన నాయకులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో చేతులు కలిపిన టీడీపీ, వైసీపీ.. రెండో విడత మున్సిపోల్స్ లో ఆసక్తికర పరిణామం



ఏపీలో రెండో విడత మున్సిపల్ ఎన్నికల వేళ నెల్లూరు జిల్లా అల్లూరులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నగర పంచాయతీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ టీడీపీ, వైసీపీ నేతలు కలిసి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు సమాచారం. అల్లూరు, సింగపేట, నార్తు మోపూరు గ్రామాలను తిరిగి పంచాయతీలుగా కొనసాగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 26న ఎన్నికలు జరగాల్సి ఉంది.

రాష్ట్రంలోని రెండో విడత మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 14న నామినేషన్ ప్రక్రియతో ఎన్నికల హడావుడి మొదలైంది. రాష్ట్రంలో మొత్తం 23 పట్టణ సంస్థల ఎన్నిక పెండింగ్ లో పడిపోగా, ఈ నెల 26న వాటికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత మున్సిపల్ ఎన్నికలకు పార్టీలు సమాయత్తమయ్యాయి. తొలి విడతలో హోరాహోరీగా పోరాడిన పార్టీలు రెండో విడతలో సత్తా చాటాలని నిర్ణయించాయి. ప్రధానంగా తొలివిడత ఫలితాలతో జోష్ తెచ్చుకున్న వైసీపీ రెండో విడతలో గట్టిపోటీ ఇవ్వాలని భావిస్తోంది. ఈ సారి 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే విపక్షం వైసీపీ రెండు కార్పొరేషన్లను గెలుచుకునే విషయంలో ధీమా వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో పలు మున్సిపాలిటీలలో గెలుపుపై నమ్మకంగా ఉందని అంటున్నారు.అయితే రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ మున్సిపాలిటీలో జరగనట్లు నెల్లూరు జిల్లా అల్లూరు నగర పంచాయతీ ఎన్నికను అడ్డుకోవాలని పార్టీలు భావిస్తున్నాయి. ఆ పట్టణంలోని అధికార, ప్రతిపక్షాలు అన్నీ కలిసి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం ఏ ఒక్కరూ నామినేషన్ వేయకుండా టీడీపీ, వైసీపీ నాయకులు అడ్డుకున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల వారు ఎదురు పడితేనే గొడవలు జరుగుతున్నట్లు పరిస్థితులు మారిపోతే, అల్లూరులో మాత్రం రెండు పార్టీల వారు కలిసి ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడం హాట్ టాపిక్ అవుతోంది.

నగర పంచాయతీ ఇష్టం లేకే..

కావలి నియోజకవర్గం పరిధిలోని అల్లూరు నగర పంచాయతీ ఏర్పాటును స్థానికులు వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నారు. అల్లూరు, సింగపేట, నార్తు మోపూరు గ్రామాలను కలిపి ఈ నగర పంచాయతీని ఏర్పాటు చేశారు. అయితే మూడు గ్రామాల వారు గ్రామ పంచాయతీలుగా కొనసాగడానికే మొగ్గుచూపుతున్నారు. గత ప్రభుత్వం నగర పంచాయతీగా ఏర్పాటు చేయడంతో కోర్టుకు వెళ్లి ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం కోర్టులో ఉన్న వివాదాలను పరిష్కరించి ఎన్నికలకు మార్గం సుగమం చేసిందని అంటున్నారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి ఎన్నికలలో ఎవరూ పాల్గొనవద్దని తీర్మానం చేసినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా నామినేషన్ కేంద్రం వద్ద రెండు పార్టీల నేతలు కాపలా కాస్తూ ఎవరూ నామినేషన్ వేయకుండా చూస్తున్నారని అంటున్నారు.

ఇప్పుడెలా..

రాష్ట్రంలో అన్ని పట్టణ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కోర్టుల్లో ఉన్న వివాదాలు అన్నీ పరిష్కరించి ఎన్నికలకు మార్గం సుగమం చేసింది. అయితే స్థానికులకు ఇష్టం లేకుండా ఎన్నికలు నిర్వహించడం వల్ల ఉపయోగమేంటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అల్లూరు పట్టణాన్ని ప్రజల కోరిక మేరకు తిరిగి మూడు పంచాయతీలుగా విడగొట్టాలని డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. అయితే దీనిపై ప్రభుత్వ పెద్దల ఆలోచన ఏంటో తెలియాల్సిన అవసరం ఉందని అంటున్నారు. స్థానికులు అంతా కలిసి ఎన్నికలు అడ్డుకుంటే ప్రభుత్వ ఆలోచనలో మార్పు రావొచ్చని అంటున్నారు.

ICE నియామకాల ప్రచారంపై విమర్శలు.. అమెరికాలో కొత్త వివాదం!



అమెరికాలో xజజు చేపట్టిన ఉద్యోగ నియామకాల ప్రచారం వివాదాస్పదమైంది. The way it was, the way it can be againμ అనే నినాదం జాత్యహంకార భావనను సూచిస్తోందని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు, ICEలో చేరేవారికి 50 వేల డాలర్ల రిటెన్షన్ బోనస్‌తో పాటు సైనింగ్ బోనస్‌లు ఇస్తామని స్టీఫెన్ మిల్లర్ ప్రకటించారు. అమెరికాలో ICE చేపట్టిన ఉద్యోగ నియామకాల ప్రచారం వివాదానికి దారితీసింది. ప్రచారంలో ఉపయోగించిన The way it was, the way it can be again అనే నినాదంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాను మళ్లీ పాత రోజుల్లోకి తీసుకెళ్లాలన్న ఈ సందేశం జాత్యహంకార భావనను సూచిస్తోందని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

వలసదారులపై కఠినంగా వ్యవహరించే ICE నుంచి ఇలాంటి నినాదం రావడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో తెల్లజాతీయుల ఆధిపత్యం ఉన్న అమెరికాను తిరిగి తీసుకురావాలనే ఉద్దేశం ఇందులో కనిపిస్తోందని వారు అంటున్నారు.రాజకీయ వ్యాఖ్యాత రిచర్డ్ హనానియా ఈ ప్రచారంపై స్పందిస్తూ.. ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేసే వారు తెల్లజాతీయులే ఉండే దేశాన్ని కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. డెమొక్రటిక్ పార్టీ వ్యూహకర్త మరియా కార్డోనా ఈ ప్రచారాన్ని జాత్యహంకార, విద్వేషపూరిత సందేశంగా అభివర్ణించారు.ఈ నియామకాల వెనుక ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాల్లో కీలకంగా వ్యవహరించిన స్టీఫెన్ మిల్లర్ ఉన్నారు. ICEలో చేరేవారికి 50 వేల డాలర్ల రిటెన్షన్ బోనస్‌తో పాటు సైనింగ్ బోనస్‌లు కూడా ఇస్తామని ఆయన ప్రకటించారు. ఒకవైపు భారీ బోనస్‌లతో కొత్త ఉద్యోగులను ఆకర్షించే ప్రయత్నం జరుగుతుంటే, మరోవైపు ప్రచారంలోని నినాదం రాజకీయ విమర్శలకు కారణమైంది. దీనిపై xజజు లేదా అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం నేడు తుపాను, రేపు తీవ్రతుపాను



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 'అక్వాన్' తుపానుగా బలపడి, ఆ తర్వాత తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఇస్రో వెల్లడించింది. దీని ప్రభావంతో గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, రైతులు పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు సూచించారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం క్రమంగా వాయవ్య దిశగా కదులుతూ బలపడుతోంది. ప్రస్తుతం ఇది అండమాన్ దీవులకు 700 కిలోమీటర్లు, చెన్నైకు 860 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. విశాఖపట్నంకు 1,040 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1,160 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ వెల్లడించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ వాయుగుండం వేగంగా బలపడుతూ రేపటికి తుపానుగా బలపడుతోంది. ఆ మరునాడు తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని ప్రభుత్వం హెచ్చరించింది.తీవ్ర తుపానుగా మారిన తర్వాత రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర తీరంవైపు దూసుకువచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. తీవ్ర తుపాను ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. దీని కారణంగా గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలు, ముఖ్యంగా రైతులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు. కోతకు వచ్చిన పంటలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని, కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు సిద్ధం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసే వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

'అక్వాన్'గా నామకరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపానుకు 'అక్వాన్'గా నామకరణం చేశారు. ఈ పేరును ఇరాన్ సూచించినట్లుగా చెబుతున్నారు. తుపాను సముద్రంలో కొనసాగిన సమయంలో 100 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అల్పపీడనం నుంచి వాయుగుండంగా బలపడిన తర్వాత కోస్తా వ్యాప్తంగా ఈదురుగాలుల వేగం పెరుగుతుందని అంటున్నారు. అంతేకాకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. కాగా, నవంబరు నెలలో తుపాన్లు ఎక్కువగా దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుల్లో తీరం దాటుతాయని అంటున్నారు. నవంబరు రెండో వారం తర్వాత ఉత్తరకోస్తాలో తుపాన్లు తీరం దాటడం, తీరం దిశగా రావడం 25 ఏళ్లలో ఒక్కసారే జరిగిందని చెబుతున్నారు. 1998 నవంబరు 15న అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద తుపాను తీవ్రం దాటిందని వాతావరణశాఖ రికార్డులు చెబుతున్నాయి.

రాప్తాడు కేసులో బిగ్ అప్డేట్: బాలిక ఆరోగ్యం 75% రికవరీ



రాప్తాడులో దాడికి గురైన పదో తరగతి విద్యార్థిని వేగంగా కోలుకుంటోంది. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు ఇన్ఫెక్షన్, వాపులు తగ్గాయని, 75 శాతం కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. వెంటిలేటర్ సాయం లేకుండానే 99 శాతం ఆక్సిజన్ స్థాయిని కొనసాగిస్తోంది. మరోవైపు దాడి నిందితుడు పల్మనరీ ఎంబాలిజంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థిని వేగంగా కోలుకుంటోంది. చికిత్సకు బాలిక శరీరం బాగా సహకరిస్తోందని, రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరగడంతోపాటు ఇన్ఫెక్షన్, వాపులు తగ్గినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. రక్తహీనత బాగా తగ్గిందని, గతంలో 174గా ఉన్న ఇన్ఫెక్షన్, వాపులు ప్రస్తుతం 46.38 పాయింట్లకు తగ్గినట్లు ప్రకటించింది. సాధారణ ఇన్ఫెక్షన్ కంటే ప్రస్తుతం కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ 75 శాతం రికవరీ అయినట్లు వైద్యులు తెలిపారు.దాడి కారణంగా బాలిక రక్తం తీవ్రంగా నష్టపోయింది. అత్యవసర వైద్యంతో రక్తం తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. అదేవిధంగా వెంటిలేటర్ సాయం లేకుండా 99 శాతం ఆక్సిజన్ స్థాయిని కొనసాగిస్తోంది. కుడి ఛాతీలో ద్రవం తగ్గుముఖం పట్టిందని చెబుతున్నారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుల వెల్లడించారు. వైద్యుల సహాయంతో నెమ్మదిగా నడుస్తున్న బాధితురాలికి నొప్పి, ఆందోళన తగ్గించేందుకు మందులు ఇస్తున్నామని వైద్యులు తెలిపారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తుండటం వల్ల భుజం కదుపుతున్నట్లు వైద్యులు వివరించారు.మరోవైపు బాధితురాలి ప్రస్తుత దుస్థితికి కారణమైన నిందితుడు కర్నూలు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసు కాల్పుల కారణంగా కుడి కాలు నరాలను తూటాలు చిద్రం చేసిన విషయం తెలిసిందే. దీంతో నిందితుడు పల్మనరీ ఎంబాలిజం బారిన పడినట్లు వైద్యులు గుర్తించారు. ఈ సమస్యతో బాధపడేవారి రక్తం గడ్డ కడుతుందని, దీనివల్ల గుండెకు రక్తం సరఫరా నిలిచిపోయి ప్రాణాపాయం ఎదురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. దీంతో నిందితుడిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్య విభాగంలో చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం అతడు ఆరోగ్యం మెరుగుపడిందని చెబుతున్నారు.

అయితే, ఆస్పత్రిలో కేవలం వైద్య సహాయం పొందుతున్న నిందితుడు అయినవారు ఎవరూ కనిపించకపోవడంతో మానసికంగా తీవ్ర క్షోభ అనుభవిస్తున్నాడని, దీనికారణంగా అతడు కోలుకునే అవకాశాలపై ఆందోళన వ్యక్తమవుతోందని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు నిందితుడు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలతో బతికిన అంత కాలం దుర్భర జీవితమే అనుభవించాల్సివుంటుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అభం శుభం తెలియని బాలికపై పాశవికంగా దాడి చేసిన నిందితుడిని విధి క్షమించలేదని తాజా పరిస్థితులు రుజువు చేస్తున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

సామాన్యుడికి బిగ్ రిలీఫ్: బియ్యం కొత్త ధరలు ఫిక్స్.. ఒక్క రూపాయి ఎక్కువ అమ్మితే అంతే!



బియ్యం ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై 294 ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి 516 కేసులు నమోదు చేసింది. రూ. 10.43 కోట్ల విలువైన సరుకును స్వాధీనం చేసుకుంది. బియ్యం రకాల వారీగా గరిష్ఠ విక్రయ ధరలను నిర్ణయించి, వాటిని మించి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్న బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. కృత్రిమ కొరత సృష్టిస్తున్న బియ్యం వ్యాపారులపై చర్యలతోపాటు అక్రమ నిల్వలను వెలికి తీయాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న చర్యలతో బియ్యం ధరలపై నియంత్రణ ఉంటుందని భావిస్తున్నారు. ఎల్ నినో సాకుతో బియ్యం ధరలను ఎడాపెడా పెంచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం రూ.1250 నుంచి రూ.1500 మధ్య లభించిన 26 కిలోల బియ్యం బస్తా ఇప్పుడు రూ. 2,000 వేల నుంచి రూ. 3,000 వేలకు పెరిగింది. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది. ముఖ్యంగా బియ్యం ఎక్కువగా వాడే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని గ్రహించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. బియ్యం ధరలకు కళ్లెం వేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకుందని చెబుతున్నారు.

ధాన్యం, బియ్యం నిల్వలపై నిరంతర నిఘా ఉంచడమే కాకుండా, రైస్ మిల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వలను ప్రతివారం ప్రకటించాలని ఆదేశాలు జారీ చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో స్టాక్ లిమిట్స్ పైనా కేంద్ర స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. వినియోగదారులపై అధిక భారం పడకుండా బియ్యం అక్రమ నిల్వలను గుర్తించాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్సులను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 294 బృందాలను రంగంలోకి దించడమే కాకుండా విస్తృత సోదాలకు ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు. ఈ ప్రత్యేక బృందాలు కొద్దిరోజులుగా తనిఖీలు చేపట్టి 516 కేసులు నమోదు చేశాయని, రూ.10.43 కోట్ల సరకు స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ పై నిరంతర నిఘా వేయడంలో భాగంగా అధికారులు తీసుకున్న చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా 159 టన్నుల బియ్యం, రెండు వేల టన్నుల ధాన్యం, 832 కిలోల కందిపప్పు, 1930 లీటర్ల వంట నూనె, 9.3 టన్నుల ఇతర నిత్యావసర సరుకులు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. ఈ చర్యలతో అక్రమ నిల్వలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అన్నిటికన్న ముఖ్యంగా సన్న బియ్యం ధరలు అదుపు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.ఎల్ నినో భయంతో ఈ ఏడాది బియ్యం దిగుబడులు భారీగా తగ్గిపోయే అవకాశం ఉందని జరిగిన ప్రచారాన్ని వ్యాపారులు క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో అక్రమ నిల్వలకు తెరతీసినట్లు ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పంట దిగుబడులు రాకముందే రూ.50 ఉన్న కిలో బియ్యం రూ.90కి ఎగబాకింది. దీంతో సామాన్యుడిపై పెనుభారం పడిందని అంటున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. మూడు వారాలుగా ప్రభుత్వ పర్యవేక్షణ పెరగడంతో ప్రస్తుతం ధరల పెరుగుదల ఆగిందని చెబుతున్నారు. లేనిపక్షంలో ప్రతివారం బియ్యం ధరలను క్వింటాకు వంద నుంచి రెండు వందలు పెంచేవారని చెబుతున్నారు.ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో బియ్యం నిల్వలను తెలుసుకుని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయాలు సాగాలని అధికారులు నిర్ణయించారని అంటున్నారు. ఈ మేరకు మిల్లర్లు, బియ్యం వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని చెబుతున్నారు. బియ్యం ధరలను కూడా ఖరారు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం బీపీటీ (సోనా), బీపీటీ (సాంబ), కేఎన్ఎం రకాల బియ్యం ధర కిలో రూ.66కి విక్రయించాలి. అంతకుమించి ఒక్కరూపాయి కూడా పెంచి అమ్మకూడదని ప్రభుత్వం నిషేధం విధించింది. అదేవిధంగా హెఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలకు రూ.76, జైశ్రీరామ్ రూ.82, ఎంటీయూ సాధారణ రకాలు రూ.47కు విక్రయించాలని స్పష్టం చేసింది. ఈ ధరలను ప్రతివ్యాపారి పాటించాలని తెలిపింది. ప్యాకింగ్ పై పాత తేదీలు ఉన్నప్పటికీ కొత్త ధరలకే బియ్యం విక్రయించాలని ఆదేశించింది. దీంతో కొద్ది రోజుల్లో బియ్యం ధరలు అదుపులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

మోదీపై అవినీతి మరక లేదు!

పుణె: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని గత 12 ఏళ్ల పాలనలో ఆయనపై కనీసం నాలుగు అణాల అవినీతి ఆరోపణ కూడా రాలేదని వ్యాఖ్యానించారు. అదే కాంగ్రెస్ గత పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలకు పాల్పడిందని ఆరోపించారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో అమిత్‌షా మాట్లాడుతూ కాంగ్రెస్‌పై రాజకీయ విమర్శలు చేశారు. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఆ పార్టీ తీవ్ర అసహనానికి గురవుతోందని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు

దేశ ప్రజలు కాంగ్రెస్‌కు పదేళ్లపాటు పాలించే అవకాశం ఇచ్చారని, ఆ సమయంలో భారీ అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకున్నాయని అమిత్‌షా ఆరోపించారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసి నరేంద్ర మోదీకి పాలనా బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, ఆయనపై అవినీతి ఆరోపణలు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

రాహుల్ విదేశీ పర్యటనలు ఆపాలి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అమిత్‌షా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీయడం ద్వారా అధికారంలోకి రావడం సాధ్యం కాదన్నారు. నిజంగా అధికారం కావాలంటే విదేశీ పర్యటనలను



తగ్గించి దేశంలోని గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారి విశ్వాసాన్ని పొందాలని వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని, భారత అభివృద్ధి ప్రయాణాన్ని ప్రశంసిస్తున్నాయని, అలాంటి సమయంలో దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇదే వైఖరిని అనుసరిస్తే మరో 30 ఏళ్లపాటు ఆ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు.

భారత్ సమిట్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'భారత్ సమిట్--2026'లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు తాజా రాజకీయ వివాదానికి కారణమయ్యాయి. 2014లోనే భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలోకి భారీగా నగదు ప్రవహించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రభావం పడిందని వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన సుమారు 14 కోట్ల మంది ప్రజలను కొన్ని నెలల తర్వాత ఓటర్లు కానివారిగా లేదా ఉనికిలో లేనివారిగా ప్రకటించారంటూ ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తారు.

రాహుల్ వ్యాఖ్యలకు అమిత్‌షా కౌంటర్

భారత్ సమిట్ వేదికగా రాహుల్ చేసిన వ్యాఖ్యలను అమిత్‌షా తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థపై అంతర్జాతీయ వేదికల్లో విమర్శలు చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల పరాజయాలను విశ్లేషించుకోవాలని సూచించారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలపై పోరాడితేనే రాజకీ యంగా బలపడే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు.

మాటల యుద్ధంతో మరింత వేడెక్కిన రాజకీయం

భారత్ సమిట్ వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రతరం అయ్యాయి. ఒకవైపు మోదీ పాలనలో అవినీతి లేదని బీజేపీ నేతలు చెబుతుండగా, మరోవైపు ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇరుపార్టీల మధ్య ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి.

అయ్యప్ప భక్తులకు శుభవార్త..

శబరిమల అయ్యప్ప స్వామి మండల, మకరవిళక్కు పూజల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు అందించింది. తెలుగు రాష్ట్రాల నుంచి కేరళలోని కొల్లాంకు భారీగా తరలివెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, చర్లపల్లి, మచిలీపట్నం ప్రాంతాల నుంచి కొల్లాం వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది.

చర్లపల్లి -- కొల్లాం ప్రత్యేక రైళ్లు (07180 / 07181)

చర్లపల్లి నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07180) నవంబర్ 20 నుంచి డిసెంబర్ 25 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11:45 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం -- చర్లపల్లి స్పెషల్ రైలు (నంబర్ 07181) నవంబర్ 22 నుంచి డిసెంబర్ 27 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10:40 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 7:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, మావేలికర, కాయంకులం, కరుణాగపల్లి, శాస్తాంకోట తదితర కీలక స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

హైదరాబాద్ -- కొల్లాం ప్రత్యేక రైళ్లు (07193 / 07194)

హైదరాబాద్ నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07193) డిసెంబర్ 5 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 11:10 గంటలకు బయలుదేరి, సోమవారం ఉదయం 7:15 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం -- హైదరాబాద్ ప్రత్యేక రైలు (నంబర్



07194) డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 10:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ సర్వీసు సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు స్టేషన్ల మీదుగా సాగుతుంది. అలాగే పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, మావేలికర, కాయంకులం స్టేషన్లలో హాల్ట్ కల్పించారు.

మచిలీపట్నం -- కొల్లాం ప్రత్యేక రైళ్లు (08539 / 08540)

ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రయాణించే భక్తుల కోసం మచిలీపట్నం -- కొల్లాం మధ్య మరో ప్రత్యేక రైలును అందుబాటులోకి తెచ్చారు. రైలు నంబర్ 08539 నవంబర్ 22 నుంచి జనవరి 24 వరకు ప్రతి ఆదివారం ఉదయం 9:20 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 9:30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 08540 నవంబర్ 24 నుంచి జనవరి 26 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు కొల్లాంలో బయలుదేరుతుంది. ఈ రైలు విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా కొల్లాం చేరుకుంటుంది. శబరిమల యాత్రకు సిద్ధమవుతున్న భక్తులు ఈ ప్రత్యేక రైలు సర్వీసులను వినియోగించుకోవాలని రైల్వే వర్గాలు సూచించాయి. ప్రత్యేక రైళ్ల సమయాలు, సర్వీసుల నిర్వహణలో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు అధికారిక సమాచారం, టికెట్ బుకింగ్, బెర్తుల లభ్యత కోసం ఇండియన్ రైల్వేస్ లేదా ఐఆర్‌సీటీసీ (×=ఙుజ) వెబ్‌సైట్, యాప్‌ను పరిశీలించాలని అధికారులు స్పష్టం చేశారు.

నెహ్రూ వారసత్వాన్ని చెరిపేయడం సాధ్యం కాదు!

న్యూఢిల్లీ: భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక వారసత్వాన్ని కించపరిచేందుకు బీజేపీ, ఆరెస్సెస్ పథకం ప్రకారం వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణంలో నెహ్రూ పోషించిన పాత్రను తక్కువ చేసి చూపేందుకు గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది. అయితే భారతదేశ భావనలో నెహ్రూ ఆలోచనలు అంతర్భాగమని, దేశ చరిత్ర నుంచి ఆయనను వేరు చేయడం ఎవరికీ సాధ్యం కాదని స్పష్టం చేసింది. దిల్లీలో నిర్వహించిన 'నెహ్రూ మెమోరియల్ యూత్ ఫెస్టివల్--2026' ముగింపు సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

వ్యూహాత్మకంగా కించపరిచే ప్రయత్నాలు

నెహ్రూ చేసిన చారిత్రక సేవలను తుడిచిపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు లోపల, బయట నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడం బీజేపీ, ఆరెస్సెస్ వ్యూహంలో భాగంగా మారిందని విమర్శించారు. ఇలాంటి ప్రయత్నాలను భావోద్వేగాలతో కాకుండా తార్కికత, విజ్ఞానం, వాస్తవాలతో ఎదుర్కోవాలని యువతకు పిలుపునిచ్చారు.

యువత చరిత్రను అధ్యయనం చేయాలి

చారిత్రక పత్రాలను ఆనాటి పరిస్థితులు, సామాజిక, రాజకీయ నేపథ్యాలకు అనుగుణంగా అధ్యయనం చేయాలని జైరాం రమేశ్ సూచించారు. చరిత్రలోని అంశాలను సందర్భం నుంచి వేరు చేసి విశ్లేషించడం వల్ల వాస్తవాలు వక్రీకరణకు గుయ్యే ప్రమాదం ఉందన్నారు. యువ పరిశోధకులు, విద్యార్థులు 'నెహ్రూ ఆర్కైవ్' వంటి ప్రామాణిక ఆధారాలను పరిశీలించాలని కోరారు. చరిత్ర రచనలో ఆధారాల ప్రామాణికత,



వాస్తవ విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

రాజకీయాల్లో నెహ్రూ లాంటి వారు అరుదు

నెహ్రూ కేవలం గొప్ప ప్రధానమంత్రి మాత్రమే కాదని, మానవతావాది, సున్నిత మనస్తత్వం కలిగిన మంచి వ్యక్తి అని జైరాం రమేశ్ కొనియాడారు. రాజకీయాల్లో ఇలాంటి వ్యక్తిత్వం కలిగిన నాయకులు చాలా అరుదుగా కనిపిస్తారని అన్నారు. మహాత్మా గాంధీ తన మరణానికి 19 రోజుల ముందు నెహ్రూకు రాసిన లేఖను ఈ సందర్భంగా గుర్తుచేశారు. నెహ్రూ దీర్ఘకాలం జీవించి భారతదేశానికి ఆభరణంగా నిలవాలని గాంధీ ఆకాంక్షించిన విషయాన్ని ప్రస్తావించారు.

రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర

భారత రాజ్యాంగ నిర్మాణం, స్వాతంత్ర్యానంతర దేశాభివృద్ధిలో నెహ్రూ కీలక పాత్ర పోషించారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు, రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో ఆయన పాత్రను గుర్తుచేశారు. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా నెహ్రూ కృషిని అంగీకరించారని తెలిపారు. దేశ ఆర్థిక విధానాలకు పునాదులు వేయడం, అలీన విధానాన్ని విదేశాంగ విధానంలో భాగంగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాల్లో నెహ్రూ దార్శనికత స్పష్టంగా కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు.

చరిత్రకారుల కంటే వక్రీకర్తలే ఎక్కువ!

దేశంలో ప్రస్తుతం చరిత్రను అధ్యయనం చేసేవారి కంటే చరిత్రను వక్రీకరించే వారి సంఖ్య పెరిగిపోయిందని జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని మోదీనే అతిపెద్ద చరిత్ర వక్రీకర్తగా అభివర్ణించారు. ఇలాంటి ప్రచారాలను ఎదుర్కోవడానికి జ్ఞానం, పరిశోధన, ప్రామాణిక చారిత్రక ఆధారాలే సరైన మార్గాలని స్పష్టం చేశారు.

నెహ్రూ జయంతి సందర్భంగా నివాళులు

1889 నవంబర్ 14న అలహాబాద్‌లో జన్మించిన జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యానంతరం భారతదేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న ఆయన కన్నుమూశారు. నెహ్రూ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో ఆయన అందించిన సేవలు, ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం నేటికీ ప్రాధాన్యం కలిగి ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

రాజకీయంగా వేడెక్కుతున్న చరిత్ర చర్చ


నెహ్రూ వారసత్వంపై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలు, బీజేపీపై జైరాం రమేశ్ విమర్శలు మరోసారి దేశ రాజకీయాల్లో చరిత్రకు సంబంధించిన చర్చను తెరపైకి తెచ్చాయి. స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణంలో వివిధ నాయకుల పాత్ర, చారిత్రక సంఘటనల విశ్లేషణపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీవారి భక్తులకు ఎస్వి మ్యూజియం ఎంట్రీ



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నూతనంగా ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం (ఎస్వీ మ్యూజియం) భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు సిద్ధమైంది. తిరుమల ప్రాశస్త్యం, సనాతన ధర్మ వైభవం, వేల ఏళ్ల చారిత్రక సంపదను ప్రతిబింబించేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దింది. నవంబర్ 16 నుంచి ఈ మ్యూజియం సాధారణ భక్తుల సందర్శనార్థం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సాంకేతిక సహకారంతో నాలుగు అంతస్తుల్లో, దాదాపు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో మొత్తం 14 ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. దాదాపు 8,000కు పైగా పురాతన కళాఖండాలు, చారిత్రక ఆధారాలు, అరుదైన రాతి, కాంస్య శిల్పాలు, నాణేలు, పురాతన ఆయుధాలు, పూజా సంప్రదాయ వస్తువులతో పాటు ఆధునిక డిజిటల్ ప్రదర్శనలను ఇక్కడ కొలువుదీర్చారు. ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ' నిలవనుంది. విశ్వం, సృష్టి రహస్యాలు, బ్రహ్మాండ విస్తృతిని భక్తులకు కళ్లకు కట్టేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని రూపొందించారు. హోలోగ్రాఫిక్ ప్రదర్శనలు, 360 డిగ్రీల సౌండ్ సిస్టమ్, డిజిటల్ విజువల్స్ ద్వారా సరికొత్త అనుభూతిని అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు, సంప్రదాయ సంగీత వాయిద్యాల ప్రత్యేక గ్యాలరీ సంగీత, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకోనుంది. శ్రీవారి చరిత్ర, ఆలయ నిర్మాణ పరిణామ క్రమాన్ని భవిష్యత్ తరాలకు సులువుగా వివరించేలా డిజిటల్ ఆర్కైవ్స్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 2026 సెప్టెంబర్ 16న ఈ నూతన మ్యూజియం ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాగా, నవంబర్ 16 నుంచి సాధారణ భక్తుల సందర్శనార్థం టికెట్లను జారీ చేయనున్నారు. ఈ మ్యూజియం సందర్శనకు ప్రవేశ రుసుముగా ఒక్కొక్కరికి రూ. 50 చొప్పున నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యూజియాన్ని సందర్శించవచ్చు. టికెట్లను సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే జారీ చేస్తారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికులు, పరిశోధకులు, విద్యార్థులకు ఈ మ్యూజియం ఒక అద్భుత ఆధ్యాత్మిక, చారిత్రక విజ్ఞాన వేదికగా నిలవనుంది.

ఏపీ, ఒడిశాలకు తుపాను హెచ్చరికలు జారీ..



ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేసింది. ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుపానుగా మారే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ప్రస్తుతం ఉత్తర-వాయవ్య దిశగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఐఎండీ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సమయానికి ఈ వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 960 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1070 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 800 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అలాగే శ్రీలంకలోని త్రింకోమలీకి ఈశాన్యంగా 620 కిలోమీటర్లు, అండమాన్ నికోబార్ దీవులలోని శ్రీ విజయపురానికి పశ్చిమ-నైరుతి దిశలో 680 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ వాయుగుండం సోమవారానికి (నవంబర్ 16) మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత మంగళవారం (నవంబర్ 17) నాటికి పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనిస్తూ మరో రెండు రోజుల్లో, అంటే గురువారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకువస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తీవ్ర తుపాను ప్రభావం ప్రధానంగా కోస్తాంధ్రపై ఉండే అవకాశముందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీనివల్ల గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. మంగళవారం వరకు కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. రైతులు, తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గడచిన 20 రోజుల వ్యవధిలోనే బంగాళాఖాతంలో ఏర్పడి ఏపీ తీరం వైపు వస్తున్న మూడో తుపాను ఇది కావడం గమనార్హం. అక్టోబర్ 27న అత్యంత తీవ్ర తుపాను 'అర్నాట్' నరసాపురం సమీపంలో తీరం దాటగా, ఆ వెంటనే నవంబర్ 3న తీవ్ర తుపాను 'మురసు' నెల్లూరు-నరసాపురం మధ్య తీరాన్ని తాకింది. వారం వ్యవధిలోనే వచ్చిన ఈ రెండు తుపాన్ల కారణంగా 15 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు తీరప్రాంత జిల్లాల్లో పంటలు, మౌలిక వసతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పుడు మరో తీవ్ర తుపాను ముంచుకొస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టింది.

న్యూయార్క్‌కు మళ్లీ ఎయిరిండియా నాన్‌స్టాప్ విమానాలు.. 5 గంటల సమయం ఆదా

ఢిల్లీ, ముంబై నుంచి న్యూయార్క్‌కు నాన్‌స్టాప్ సర్వీసుల పునరుద్ధరణ

ఇంధనం కోసం రోమ్‌లో ఇకపై ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం

గతంలో 22 గంటలు పట్టిన ప్రయాణ సమయం 17 గంటలకు కుదింపు

ఇరాక్ గగనతలం అందుబాటులోకి రావడంతో సులువైన విమాన మార్గం

వివిధ మార్గాల్లో అధునాతన ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 777 విమానాల సేవలు

భారత్ నుంచి అమెరికా వెళ్లే ప్రయాణికులకు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా తీపి కబురు అందించింది. ఢిల్లీ, ముంబై నగరాల నుంచి న్యూయార్క్‌కు నేరుగా నడిచే నాన్‌స్టాప్ విమాన సర్వీసులను సంస్థ అధికారికంగా పునరుద్ధరించింది. గగనతల ఆంక్షలు సడలించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పు వల్ల ప్రయాణికులకు సుమారు 5 గంటల వరకు ప్రయాణ సమయం ఆదా కానుంది. గతంలో పశ్చిమాసియా పరిసరాల్లోని గగనతల ఆంక్షల కారణంగా ఎయిరిండియా విమానాలు సుదీర్ఘ మార్గంలో ప్రయాణించాల్సి వచ్చేది. మధ్యలో ఇంధనం నింపుకోవడానికి ఇటలీలోని రోమ్ నగరంలో టెక్నికల్ స్టాప్ తీసుకునేవి. దీంతో ప్రయాణానికి దాదాపు 22 గంటల సమయం పట్టేది. తాజాగా నేరుగా నాన్‌స్టాప్ సర్వీసులు ప్రారంభం కావడంతో, ప్రయాణ సమయం దాదాపు 17 గంటలకు తగ్గిపోయింది.

బిజినెస్

ఏఐలో అగ్రగామి పోటీదారు భారత్

కంప్యూట్ కంటే నైపుణ్యాలే బలం



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతలో ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 'రైజింగ్ కంటెండర్ (అగ్రగామి పోటీదారు)'గా మనదేశం నిలిచింది. భారీ స్థాయిలో సూపర్ కంప్యూటర్లు, చిప్‌లు వంటి కంప్యూట్ మౌలిక సదుపాయాల కంటే.. బలమైన టెక్ నైపుణ్యాలు, విస్తృత మానవ వనరులే భారత్‌ను ఈ స్థానంలో నిలిపాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నివేదిక తెలిపింది. ఏఐ మెచ్యూరిటీ మ్యాట్రిక్స్ 2026 పేరిట బీసీజీ ఈ నివేదికను వెలువరించింది. 33 సూచీల ఆధారంగా 75 దేశాల వివరాలతో ఈ నివేదిక రూపొందించింది. 7 'ఏఐ పయనీర్స్' తర్వాతి స్థానంలో భారత్ నిలిచింది. భారత్ ఆతిథ్యమిచ్చిన 2026 ఏఐ ఇంపాక్ట్ సమిట్, దేశంలో ఏఐ ఎదుగుదలకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. ఏఐ పయనీర్స్‌గా కెనడా, చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, బ్రిటన్, అమెరికా ఉన్నాయి. రైజింగ్ కంటెండర్స్‌లో భారత్, చిలీ, ఇండోనేషియా, లిథువేనియా, న్యూజిలాండ్, పోలండ్, తుర్కియే, వియత్నాం నిలిచాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే జపాన్, దక్షిణ కొరియా పయనీర్స్ హోదాకు వెళ్లగా, గ్రీస్, చెక్ రిపబ్లిక్, చిలీ, లిథువేనియా, ఈక్వెడార్, నైజీరియాలు తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి. మనదేశం స్థిరంగా కంటెండర్స్ శ్రేణిలో కొనసాగుతోంది.

సవాళ్లు కూడా ఉన్నాయ్

కంప్యూట్ లేదా సర్వర్‌లను కొన్ని నెలల్లో కొనుగోలు చేయొచ్చు. కానీ నైపుణ్యం కలిగిన మానవ వనరులను అంత వేగంగా తయారు చేయలేమని బీసీజీ పేర్కొంది. దేశంలో ఉన్న వనరులను ఎంత త్వరగా సామర్థ్యాలుగా మారుస్తారనేదే భారత్‌కు ముందున్న ప్రధాన పరీక్ష. కంపెనీల ఆదాయంలో ఏఐపై పెట్టుబడులు 2025తో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపయ్యాయి. సర్వే చేసిన సీఈఓల్లో 90% మంది వ్యయ నియంత్రణ, రాబడుల ప్రయోజనాలు కనిపిస్తున్నాయని తెలిపారు. జాతీయ వ్యూహాల రూపకల్పన కంటే, వాటిని అమలు చేయడం ముఖ్యం. నిరంతర విద్యుత్ లభ్యత, గ్రిడ్ అనుసంధానత, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ ఏఐ మౌలిక సదుపాయాల కల్పనకు కీలకంగా మారుతున్నాయి.

బలాలు ఇవే..

మన దేశంలో ఎక్కువ సంఖ్యలో ఏఐ నిపుణులు ఉండటం, ఐటీ సేవల రంగం బలాలుగా ఉన్నాయి. భారత ఐటీ ప్రాసెస్, డెలివరీ నిర్వహణ.. ఏఐ వ్యవస్థలను నడిపించేందుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయి. అమెరికా, బ్రిటన్, యూఏఈ, కెనడాల నుంచి నైపుణ్యం కలిగిన భారతీయులు స్వదేశానికి రావడం భారత్‌కు కలిసివస్తోంది. 2025లో అంతర్జాతీయంగా ఏఐ నిపుణుల వలసలు 12% తగ్గి పోటీ నెలకొన్న తరుణంలో ఈ పరిణామం మనకు లాభం చేకూర్చనుంది. కోటి మంది పౌరులకు ఉచిత ప్రాథమిక ఏఐ నైపుణ్యాలను అందించే లక్ష్యంతో ప్రారంభించిన 'యువ ఏఐ ఫర్ ఆల్', ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏఐ ల్యాబ్‌లు, ధ్రువీకరణలను అందించే 'ఇండియా-ఏఐ ఫ్యూచర్స్ స్కిల్స్ వంటివి కలిసొస్తున్నాయి.

సైబర్‌ట్రక్‌కు మరో ఛాన్స్..
మస్క్ సంచలన నిర్ణయం!

టెస్లా సైబర్‌ట్రక్ ఉత్పత్తి విషయంలో.. ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 2027 మధ్యలోనే ఈ వాహనం తయారీని నిలిపివేస్తామని ప్రకటించిన కొన్ని రోజుల తరువాత.. తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. 2027 వేసవి చివరి వరకు సైబర్‌ట్రక్ ఉత్పత్తిని కొనసాగిస్తామని వెల్లడించారు.



సైబర్‌క్యాబ్ ఉత్పత్తి

నిజానికి టెక్సాస్‌లోని గిగాఫ్యాక్టరీలో సైబర్‌ట్రక్ తయారీని తగ్గించి, ఆ స్థానంలో సైబర్‌క్యాబ్ ఉత్పత్తిని పెంచాలని టెస్లా భావిస్తోంది. సైబర్‌క్యాబ్ అనేది డ్రైవర్ అవసరం లేకుండా ప్రయాణించేలా రూపొందిస్తున్న రోబోటాక్సీ వాహనం. అయితే.. సైబర్‌ట్రక్ కోసం ఇంకా చాలా ఆర్డర్లు పెండింగ్‌లో ఉండటంతో, వాటిని పూర్తి చేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని మస్క్ నిర్ణయించారు. లేదంటే.. వాహనాలు అందించలేని కస్టమర్లకు బుకింగ్ సమయంలో చెల్లించిన డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సి రావచ్చు. ఉత్పత్తిని పొడిగించడం వల్ల కంపెనీకి పెద్దగా లాభం ఉండకపోవచ్చని కూడా మస్క్ కూడా అంగీకరించారు. లాభాలను పెంచుకునే కోణంలో చూస్తే ఇది అంత తెలివైన నిర్ణయం కాకపోవచ్చని, అయితే వ్యాపారంలో కొంత భావోద్వేగానికి కూడా చోటు ఉండాలని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సైబర్‌ట్రక్ అమ్మకాలు మొదట అనుకున్న స్థాయిలో లేకపోయినా.. దాని ప్రత్యేకమైన స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ, విభిన్నమైన డిజైన్ కారణంగా వాహన ప్రియులను ఆకట్టుకుంది. మరోవైపు సైబర్‌ట్రక్ విషయంలో మస్క్ పెట్టుకున్న అమ్మకాల లక్ష్యాలు ఇప్పటివరకు అందుకోలేకపోయారు.

అమ్మకాలు ఇలా..

ప్రారంభంలో ఏడాదికి 2.5 లక్షల వాహనాలను విక్రయించాలని గతంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 2023 చివర్లో డెలివరీలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం అమ్మకాలు సుమారు 70 వేల యూనిట్లేనని పరిశ్రమ అంచనాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో ఉత్పత్తి మరికొంత కాలం కొనసాగనున్నప్పటికీ, 2027 తర్వాత కూడా ఈ వాహనాన్ని తయారు చేస్తారా లేదా అనే దానిపై టెస్లా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇక సైబర్‌ట్రక్ ఉత్పత్తిని నిలిపివేయాలన్న ఆలోచనపై అభిమానులు, యజమానుల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. ఈ వాహనం తయారీ కొనసాగించాలని కోరుతూ 5,000 మందికి పైగా ఒక పిటిషన్‌పై సంతకాలు చేశారు. మరోవైపు టెస్లా వాహనాలకు యాక్సెసరీలు తయారు చేసే అన్‌ప్లగ్డ్ పెర్ఫార్మెన్స్ సంస్థ కూడా పెట్టుబడిదారుల సహకారంతో సైబర్‌ట్రక్ ఉత్పత్తిని తామే చేపట్టే అవకాశాలను పరిశీలిస్తోంది.

జియో ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ తొలగింపు

ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో తన ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను తొలగించింది. అయితే, ఇది కొత్త వినియోగదారులకే వర్తిస్తుంది. ఇదివరకే ప్రీపెయిడ్ రీఛార్జ్‌లపై గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ పొందుతున్న యూజర్లకు ఈ ఆఫర్ కొనసాగుతుంది. ఈ మేరకు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. రూ.35,100 విలువైన గూగుల్ ఏఐ ప్రో ప్రయోజనాలను ప్రీపెయిడ్ ప్లాన్స్‌పై ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే జియో ఉచితంగా అందించింది. ఇకపై కొత్త యూజర్లకు కాన్వా సబ్‌స్క్రిప్షన్‌ను మాత్రమే లభిస్తుంది. ఎంపిక చేసిన రీఛార్జ్ ప్లాన్స్‌పై కాన్వా ప్రో, కాన్వా ప్రో లైట్ ప్రయోజనాలు పొందొచ్చు. రూ.399 ప్రీపెయిడ్ ప్లాన్ నుంచి రూ.4 వేల విలువైన కాన్వా ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను 12 నెలల పాటు ఉచితంగా అందిస్తుంది. దీంతో పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, మొబైల్ ద్వారా జియో గేమ్స్ వీక్షించే వెసులుబాటు ఉంది. రూ.349 ప్రీపెయిడ్ ప్లాన్‌పై రూ.1590 విలువైన కాన్వా ప్రో లైట్‌ను 12 నెలల పాటు ఫ్రీగా తీసుకొచ్చింది. దీంతో పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, జియో ఏఐ క్లౌడ్ 50 జీబీ స్టోరేజ్ పరకు ఉచితంగా పొందొచ్చు. ఈ రీఛార్జ్ ప్లాన్స్‌ను ఇప్పటికే క్లెయిమ్ చేసుకున్న వినియోగదారులకు గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్ యథావిధిగా కొనసాగుతుంది. తొలగింపునకు గల కారణాలు తెలియరాలేదు.



స్పోర్ట్స్

టీమిండియా సంచలన విజయం..
వన్డే సిరీస్ కైవసం.. కివీస్ ఏడేళ్ల రికార్డుకు బ్రేక్

న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా చరిత్ర సృష్టించింది. ఐదో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్‌ను 22 పరుగుల తేడాతో ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో తడబడినప్పటికీ.. బౌలింగ్‌లో అద్భుతంగా పుంజుకున్న భారత జట్టు 209 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కివీస్ అందుకోకుండా అడ్డుకుంది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో న్యూజిలాండ్‌ను 48.1 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌట్ చేసింది . ఈ విజయంతో సొంతగడ్డపై వరుసగా ఏడు సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యూజిలాండ్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయాల పరంపరకు భారత్ తెరదించింది.

209 పరుగులకే భారత్ ఆలౌట్

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తొలి ఎనిమిది ఓవర్లలోనే మాథ్యూ ఫిషర్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరారు. దీంతో భారత జట్టు ఒత్తిడిలో పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా షార్ట్ బాల్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడి వికెట్ సమర్పించుకున్నాడు. టాప్ ఆర్డర్ వైఫల్యంతో భారత్ భారీ స్కోరు సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ బాధ్యతాయుతంగా ఆడారు. వికెట్లు పడుతున్నా క్రీజులో నిలదొక్కుకుని పరుగులు రాబట్టారు. ఇద్దరూ 46 పరుగుల చొప్పున సాధించి భారత ఇన్నింగ్స్‌కు కీలకంగా నిలిచారు. అయితే వీరిద్దరూ అర్ధశతకాలకు నాలుగు పరుగుల దూరంలోనే వెనుదిరగడం భారత్‌కు నిరాశ కలిగించింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కీలక సమయంలో జాకబ్ డఫీ బౌలింగ్‌లో మాథ్యూ ఫిషర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మిడిలార్డర్ సైతం విఫలమైనప్పటికీ చివర్లో మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ విలువైన పరుగులు జోడించారు. అర్ష్‌దీప్ కేవలం నాలుగు బంతుల్లోనే రెండు సిక్సర్లు సహా 14 పరుగులు చేశాడు. సిరాజ్ కూడా కీలక బౌండరీలు, సిక్సర్‌తో అలరించాడు. వీరిద్దరి పోరాటంతో భారత్ స్కోరు 200 పరుగుల మార్కును దాటింది.చివరకు 42.1 ఓవర్లలో 209 పరుగులకు భారత ఇన్నింగ్స్ ముగిసింది.

న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్ 3 వికెట్లు, జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టారు. మాథ్యూ ఫిషర్ రెండు వికెట్లతో భారత టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. దీంతో 50 ఓవర్లకు ముందే భారత్ ఆలౌటైంది.



కివీస్‌కు ఆదిలోనే షాక్‌లు

210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు భారత పేసర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో నిక్ కెల్లీ 24 పరుగుల వద్ద బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత ఫిన్ అలెన్‌ను మహమ్మద్ సిరాజ్ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. షార్ట్ లెంగ్త్‌లో వచ్చిన బంతిని ఆడే ప్రయత్నంలో అలెన్ బ్యాట్‌కు, ప్యాడ్‌కు మధ్య నుంచి వెళ్లి ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. మరోవైపు భారత ఫీల్డింగ్‌లో కొన్ని తప్పిదాలు కనిపించాయి. విరాట్ కోహ్లీ స్లిప్‌లో డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేశాడు. యశ్ ఠాకూర్ కూడా మైఖేల్ బ్రేస్‌వెల్ ఇచ్చిన అవకాశాన్ని అందుకోలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌కు కొంత ఊరట లభించింది.

83 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మైఖేల్ బ్రేస్‌వెల్ ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఫాక్స్‌క్రాఫ్ట్ 42 బంతుల్లో 31 పరుగులు చేయగా.. బ్రేస్‌వెల్ 33 బంతుల్లో 19 పరుగులు సాధించాడు. అయితే ఈ భాగస్వామ్యాన్ని ఔకిట్ నబీ విడదీశాడు. బ్రేస్‌వెల్ ఇచ్చిన క్యాచ్‌ను నామన్ ధీర్ అందుకోవడంతో న్యూజిలాండ్ ఐదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాతి ఓవర్లోనే యశ్ ఠాకూర్ తన అరంగేట్ర వన్డేలో తొలి వికెట్ సాధించాడు. ఫాక్స్‌క్రాఫ్ట్‌ను బౌల్డ్ చేసి భారత శిబిరంలో ఆనందం నింపాడు. దీంతో కివీస్ 119 పరుగుల వద్ద ఐదు వికెట్లు కోల్పోయింది.

ఆ తర్వాత కెప్టెన్ మిచెల్ సాంట్నర్, క్రిస్టియన్ క్లార్క్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించారు. సాంట్నర్ 31 బంతుల్లో 24 పరుగులు చేశాడు. ఇందులో రెండు సిక్సర్లు ఉన్నాయి. అయితే నామన్ ధీర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించి అర్ష్‌దీప్ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ వికెట్ మ్యాచ్‌లో కీలక మలుపుగా మారింది. మరోవైపు క్రిస్టియన్ క్లార్క్ 35 బంతుల్లో 16 పరుగులు చేసి పోరాడాడు. కానీ అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో న్యూజిలాండ్ విజయానికి దూరమైంది. చివరి ఓవర్లలో కివీస్ టెయిలెండర్లు బ్లెయిర్ టిక్నర్, జాకబ్ డఫీ కొంత పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో డఫీ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. చివరకు 48.1వ ఓవర్‌లో టిక్నర్ భారీ షాట్‌కు ప్రయత్నించగా బంతి బ్యాట్‌కు తగల్లేదు. క్రీజు వదిలి ముందుకొచ్చిన అతడిని వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ స్టంపౌట్ చేశాడు. దీంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 187 పరుగుల వద్ద ముగిసింది. భారత్ 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 30 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ సిరాజ్ 50 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, యశ్ ఠాకూర్, ఔకిట్ నబీ, నామన్ ధీర్ తలో వికెట్ సాధించారు.

న్యూజిలాండ్ ఏడేళ్ల రికార్డు బద్దలు

ఈ విజయంతో న్యూజిలాండ్ సొంతగడ్డపై వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లలో కొనసాగిన విజయాల పరంపరకు భారత్ బ్రేక్ వేసింది. 2019లో చివరిసారిగా భారత్ చేతిలోనే న్యూజిలాండ్ స్వదేశంలో వన్డే సిరీస్ కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత మళ్లీ అదే ప్రత్యర్థి చేతిలో ఓటమి ఎదురైంది. భారత బ్యాటింగ్‌లో లోపాలు స్పష్టంగా కనిపించినప్పటికీ, బౌలింగ్ విభాగం వాటిని కప్పిపుచ్చుతూ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

మైదానంలోనే యుద్ధం..
బయట స్నేహంగా ఉంటాం



న్యూజిలాండ్ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లను కైవసం చేసుకోవడం జట్టుకు దక్కిన గొప్ప ఘనత అని టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు. నిరంతరం మారుతున్న వాతావరణం, విభిన్నమైన పిచ్ పరిస్థితులు అనేక సవాళ్లు విసిరినప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రెండు సిరీస్‌లలోనూ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టీ20 సిరీస్ గెలుచుకోగా, నేడు జరిగిన చివరి వన్డేలోనూ గెలిచి 3-1తో వన్డే సిరీస్ ను కూడా చేజిక్కించుకుంది. ఇవాళ్టి మ్యాచ్ ముగిసిన అనంతరం శ్రేయస్ అయ్యర్ జట్టు ప్రదర్శన, వ్యూహాలపై మాట్లాడాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయినా, మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మనవైపు తిప్పుకోగలమనే గట్టి నమ్మకం తమలో ఉందని శ్రేయస్ చెప్పాడు. జట్టులోని ప్రతి ఆటగాడూ ఇదే సానుకూల దృక్పథంతో ఆలోచించారని, మైదానంలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయగలిగామని వివరించాడు. ఈ సిరీస్ పూర్తిగా బ్యాటర్లకు అనుకూలించింది కాదని, ఇరు జట్లలోని బౌలర్లదే కీలక పాత్ర అని అన్నాడు. ముఖ్యంగా భారత బౌలర్లు తీవ్ర ఒత్తిడిని తట్టుకుని, పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాలు అందించారని కొనియాడాడు. ఆటగాళ్లలో కనిపించిన ఆత్మవిశ్వాసం, పోరాట తత్వమే జట్టును ముందుకు నడిపించాయని ప్రశంసించాడు. టెస్టు మ్యాచ్‌ల సన్నాహకాలు, ఆటగాళ్ల గాయాల కారణంగా తుది జట్టులో తరచూ మార్పులు చేయాల్సి వచ్చిందని శ్రేయస్ అయ్యర్ గుర్తుచేశాడు. జట్టులో మార్పులు చేర్పులు జరిగినప్పుడు పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కాస్త కష్టమైన విషయమేనని అంగీకరించాడు. అయితే, తాము ఏ దశలోనూ ఎలాంటి సాకులు చెప్పాలనుకోలేదని స్పష్టం చేశాడు. తమపై ఉన్న అంచనాలకు తగ్గట్టుగా ఆడాలని, మైదానంలోకి దిగిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతోనే ముందుకు సాగామని పేర్కొన్నాడు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు స్టేడియాలకు భారీగా తరలివచ్చిన భారత, న్యూజిలాండ్ అభిమానులకు శ్రేయస్ అయ్యర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపాడు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇరు జట్లను సమానంగా ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని, ఇది చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉందని అన్నాడు. అభిమానుల నుంచి లభించే ఇలాంటి మద్దతే ఆటగాళ్లకు అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నాడు. మైదానంలో దిగితే ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని, అది ఒక యుద్ధంలాంటి పోరాటమని చెబుతూనే.. మైదానం వెలుపల ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య చక్కని స్నేహం ఉంటుందని, క్రీడల్లో ఎప్పుడూ ఇలాంటి వాతావరణమే ఉండాలని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు.

జాతీయ నవజాత శిశు వారోత్సవాలు-2026'' ప్రారంభోత్సవ కార్యక్రమం





ఏలూరు, నవంబర్, 15 : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎనీవీ) మరియు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుండి 21వ తేదీ వరకు నిర్వహించే "ఆదివారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (++ఎ) నందు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారిణి (ణవీడఎూ) డాక్టర్ యు. శోభ. లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డా. శోభ మాట్లాడుతూ, నవజాత శిశు మరణాలను తగ్గించడంలో మరియు శిశువుల సంపూర్ణ ఆరోగ్య వికాసంలో పుట్టిన మొదటి 28 రోజుల సంరక్షణ అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా తక్కువ బరువుతో జన్మించిన శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు మరియు ఎస్.ఎన్.సి.యు (ఞాచీజఖ) నుండి డిశ్చార్జ్ అయిన శిశువుల పట్ల తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా క్రమం తప్పకుండా ఫాలో-అప్ పరీక్షలు చేయించడం, ఇంట్లో కంగారూ మదర్ కేర్ (ఖవీజ) పద్ధతిని పాటించడం మరియు మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుల భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దవచ్చని వివరించారు.

జాతీయ నవజాత శిశు వారోత్సవాలలో భాగంగా చేపట్టే ప్రధాన కార్యక్రమాలు

ఆసుపత్రి స్థాయిలో: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఞాచీజఖ, చీదీూఖ, పీడియాట్రిక్ వార్డు మరియు లేబర్ రూమ్ సేవల బలోపేతం, నవజాత శిశువులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం మరియు తల్లులకు శిశు సంరక్షణపై అవగాహన కల్పించడం.

క్షేత్ర స్థాయిలో ఫాలో- అప్: ఆశా (ఊూనూ) కార్యకర్తలు మరియు ఏఎన్ఎం (ఊచీవీ)ల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మరియు మారుమూల గిరిజన, బలహీన వర్గాల నివాస ప్రాంతాలలో ఉన్న నవజాత శిశువుల గృహాలను సందర్శించి వారి ఎదుగుదలను పరిశీలించడం.అవగాహన కార్యక్రమాలు: వీహెచ్ఎన్డీ (ఎనచీణ) మరియు యూహెచ్ఎన్డీ (ఖనచీణ) వేదికల ద్వారా వీఖూ కార్డు ప్రాముఖ్యత, టీకాలు మరియు శిశు ఆరోగ్య జాగ్రత్తలపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం. ఈ కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పీడియాట్రిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. బ్రహ్మయ్య , ఎస్.ఎన్.సి.యు (ఞాచీజఖ) మెడికల్ ఆఫీసర్ డా. రాఘవి , జీజీహెచ్ వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, బాలింతలు, చంటిపిల్లల తల్లులు మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా డా. పుల్లయ్య వ్యవహరించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీకి అగ్నిపరీక్ష.. కాంగ్రెస్‌కు అస్తిత్వపరీక్ష

దేశ రాజకీయాల్లో ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ రానున్న ఎన్నికల గండాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక సతమతమవుతున్నాయి. వివిధ ప్రాంతీయ రాజకీయ శక్తులు ఒకవైపు, కొత్తగా పుట్టుకొస్తున్న యువజనోద్యమాలు మరోవైపు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో నానాటికీ మారుతున్న దేశ రాజకీయ గుణాత్మక పరిణామాలు ఆ రెండు పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దశాబ్దాలపాటు కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో అధికారం చెలాయించిన ఆ రెండు పార్టీలు ఒంటరిగా పోటీ చేసే ధైర్యాన్ని ఏనాడో కోల్పోయాయి. వర్తమాన రాజకీయాల్లో సన్నగిల్లిపోతున్న మోదీ ప్రతిష్ట, అధికార పీఠానికి దరిదాపుల్లోకి కూడా రాలేని రాహుల్ దీనస్థితి ఆ పార్టీల మిత్రపక్షాలను సందిగ్ధంలోకి నెట్టేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెసేతర సంకీర్ణ రాజకీయశక్తి ఒకటి దేశ రాజకీయాలను శాసించే రోజులు రాబోతున్నాయని ప్రస్తుత పరిణామాలు సంకేతాలను అందిస్తున్నాయి.

ఇటీవల ఒక పెండ్లి వేడుకలో తమిళనాడు సీఎం విజయ్, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక్కచోట చేరి పరస్పరం ఆత్మీయంగా పలకరించుకొని ముచ్చటించారు. ఈ దృశ్యాలను యావత్తు దేశం ఆసక్తిగా గమనించింది. సహజంగానే రకరకాల ఊహాగానాలు వెల్లువెత్తాయి. అందుకు కారణం లేకపోలేదు. ఆ ముగ్గురు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు సారూప్యం ఉన్నది.

టీవీకే, వైసీపీ, బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీలైనప్పటికీ ఏ పొత్తులు లేకుండానే ఒంటరిగానే అధికారంలోకి వచ్చాయి. ఎన్నికల పొత్తు కోసం బీజేపీ, కాంగ్రెస్ వివిధ సందర్భాల్లో సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించినా అవి లొంగిపోలేదు. దక్షిణ భారత అస్తిత్వ ఆత్మగౌరవ శక్తులకు మాత్రం ఆ ముగ్గురి యాదృచ్ఛిక సమావేశం ఒక ఆశాకిరణంగా తోచింది. బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల్లో మాత్రం అలజడి చెలరేగింది. మూడో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న ప్రజల మనోగతం మరోసారి చర్చల్లోకి వచ్చింది.

1984 లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ భారీ ఆధిక్యత సాధించింది. ఆ తర్వాత 30 ఏండ్లపాటు ఏ పార్టీ మెజారిటీ మార్కును అందుకోలేకపోయింది. 2014లో మోదీ నాయకత్వంలో బీజేపీ మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసినా సొంతంగానే మెజారిటీకి అవసరమైన స్థానాలను కైవసం చేసుకున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తన బలాన్ని మరింత మెరుగుపరచుకున్నది.

మిత్రపక్షాలపై ఆధారపడే అవసరం లేని ఆధిక్యంతో మోదీ తొలి, మలి ప్రభుత్వాలు కొనసాగాయి. కానీ 2023 ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ పడిపోయింది. పూర్తి మెజారిటీకి 22 సీట్ల దూరంలో ఆగిపోయింది. బీజేపీకి జవసత్వాలు అందించిన అయోధ్య రామాలయం నిర్మాణం పూర్తయినప్పటికీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ ధాటికి యూపీలో వెనుకబడిపోయింది. 2019 తో పోల్చుకుంటే బీజేపీ 29 సీట్లు కోల్పోయింది.

ప్రధాని మోదీ 12 ఏండ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉండి కూడా గత లోక్‌సభ ఎన్నికల్లో చతికిల పడటం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యచకితులను చేసింది. దేశవ్యాప్తంగా 63 సీట్లు కోల్పోయి 543 సీట్లున్న లోక్‌సభలో 240కే పరిమితమై, సొంత బలం తగ్గిన బీజేపీ విధి లేని పరిస్థితుల్లో మిత్రపక్షాల మద్దతుతో నెట్టుకొస్తున్నది. ఇక మిత్రపక్షాల అండదండలు ఉండి కూడా కాంగ్రెస్ ఎంత గింజుకున్నా లోక్‌సభలో మూడంకెల స్కోరును చేరలేకపోతున్నది.

ఇటీవలే అధికారంలోకి వచ్చిన కేరళం మినహాయిస్తే ప్రస్తుతం



కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ చేజారిపోయే ప్రమాదం పొంచి ఉన్నట్టు వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి. స్నేహ ధర్మాన్ని విస్మరించిన ఫలితంగా చిరకాల మిత్రపక్షం డీఎంకే కాంగ్రెస్‌కు దూరమైంది. అఖిలేశ్ యాదవ్ తన దారి తాను చూసుకున్నారు. నానాటికీ కాంగ్రెస్ ఒంటరి అవుతుండగా అటు బీజేపీ మిత్రపక్షాల మధ్య వైరుధ్యాలు పెరిగిపోతున్నాయి.

కొత్తగా తెరపైకి వచ్చిన సీజేపీ, యువజనోద్యమాల ధాటికి తలొగ్గిన మోదీ ఏకంగా కేంద్ర క్యాబినెట్ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. రెండేండ్లుగా బీజేపీని అభద్రతాభావం వెంటాడుతున్నది. ఇటీవల యూపీలో శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో రెండింటిలోనూ బీజేపీ ఓడిపోయింది. కాంగ్రెస్ పోటీలోనే లేదు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అందునా, ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న యూపీలో గత లోక్‌సభ ఎన్నికల నుంచి ఆ పార్టీకి ఆటంకాలు ఎదురవుతున్నాయి.

రాహుల్ గాంధీ కూడా ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారానికి ఆమడదూరంలో ఉన్నది. యూపీ నుంచే ఎదిగివచ్చిన దివంగత కాంగ్రెస్ ప్రధానులు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ రాజకీయ వారసత్వాన్ని నిలుపుకోవడంలో రాహుల్ గాంధీ ఘోరంగా విఫలమవుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికలను, ఇటీవలి శాసనమండలి ఎన్నికలను బేరీజు వేసుకుంటే త్వరలో జరుగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేశ్ విజయకేతనం ఎగురవేయడం ఖాయంగా కనిపిస్తున్నది.

అదే సమయంలో పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయినా అందరి దృష్టి యూపీ మీదనే ఉన్నది. కేంద్ర అధికార పీఠాన్ని అందుకోవడానికి ప్రధాన నిర్ణాయక రాష్ట్రంగా 80 లోక్‌సభ సీట్లున్న యూపీలో ఉభయ జాతీయ పార్టీలు తమ ఉనికి, ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

ప్రపంచ పరిణామాలు మారుతున్నాయి. యుద్ధ పిపాసులైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహుకు వ్యతిరేకంగా ఇటీవల ఎన్నికల్లో ఆయా దేశాల ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారు. మితిమీరిన మతవాదం ఎల్లకాలం మనుగడ సాగించలేవని షరియా చట్టాలు అమల్లో ఉన్న ఇస్లామిక్ దేశాల అంతర్గత సంక్షోభాలు రుజువు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పేరుకుపోతున్న మోదీ పరివారం సామాజిక సంక్షోభాలు, ప్రజా సమస్యలను పక్కనపెట్టి పొరుగు దేశాలతో యుద్ధభయాలను ప్రజల ముందు ఉంచడం ఇంకా పనిచేయకపోవచ్చు.

మతం జపం పనిచేసేది, ప్రభావం చూపేది కొంతకాలమే. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం కొలువైన నాగపూర్, రామాలయ నిర్మాణం జరిగిన అయోధ్యలో బీజేపీ ఓడిపోవడం అందుకు తార్కాణం. మరోవైపు సవాలక్ష సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ పరివారం యావత్తు ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వెంటపడడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. పైగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అవినీతి, ఆశ్రితపక్షపాతంలో పీకల దాకా మునిగిపోయారు. అందుకు తెలంగాణనే సాక్ష్యం. నేల విడిచి సాము చేస్తున్న కాంగ్రెస్ ఉద్యమాల్లో ప్రజలు మమేకం కావడం లేదు.

దేశం యావత్తు ఏకకాలంలో అటు బీజేపీతో విసిగిపోయింది. ఇటు కాంగ్రెస్‌కు దూరమైంది. చెట్టు ఉనికిని నీడ ప్రశ్నించినట్టు 'మేం లేకుంటే మీకు బతుకు లేదు' అనే ధోరణిలో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న ఆ రెండు పార్టీల సొంత బలమెంతో ఆయా మిత్రపక్షాలకు క్రమక్రమంగా అవగతమవుతున్నది. కొన్ని ప్రాంతాలకే పరిమితమైనప్పటికీ సాంకేతికంగా ఎన్నికల కమిషన్ రికార్డుల్లో జాతీయ పార్టీలుగా చలామణి అవుతున్న ఇతర పార్టీలు దేశాన్ని ప్రభావితం చేసే స్థితిలో లేవు.

వచ్చే ఏడాది నుంచి అధికార బీజేపీ అగ్నిపరీక్షలు ఎదుర్కోబోతున్నది. ప్రతిపక్ష కాంగ్రెస్ గత వైభవ అస్తిత్వం కోసం పాకులాడుతున్నది. 25 ఏండ్లుగా ఆ రెండు పార్టీల పాలనలో ఆశలు ఈడేరక విసిగిపోయిన దేశ ప్రజలు మరో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో దేశ రాజకీయాల్లో అభివృద్ధి పథాన్ని ఆశావహ దృక్పథాన్ని అందించే నాయకత్వం కావాలి. అందుకు ప్రాంతీయ పార్టీలే ముందుకు రావాలి.

సంపాదకీయం

చిత్తశుద్ధితోనే ఉక్రెయిన్ శాంతి

వెనకుండి యుద్ధాన్ని ఎగదోయటం వేరు... దానిపై నేరుగా జరిగే చర్చల్లో పాల్గొనటం వేరు. అలా చేస్తే బాధ్యతలు మీదపడతాయి. వాటిని నెరవేర్చక తప్పనిస్థితి ఏర్పడుతుంది. అయిదేళ్లు పూర్తికావస్తున్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంపై జరిగే రెండో విడత చర్చల్లో ఆ రెండు దేశాలతోపాటు యూరోప్ కూడా పాల్గొనటానికి అంగీకారం కుదిరింది. చర్చల్లో వారి భాగస్వామ్యాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యతిరేకిస్తున్నారంటూ వచ్చిన కథనాలకు భిన్నంగా ఈసారి యూరోప్‌ను కూడా చేర్చటానికి రష్యా అంగీకరించింది. చర్చల్లో సహజంగానే యుద్ధంలో యూరోప్ పాత్ర కూడా చర్చకు వస్తుంది. ఆ దేశాలు యుద్ధం కోరుకుంటున్నాయో, శాంతిని వాంఛిస్తున్నాయో తేటతెల్లం కావటానికి అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభించింది రష్యా కాదు. 2014లో ఉక్రెయిన్‌లో అంతర్యుద్ధంగా మొదలైన ఆ ఘర్షణలోకి లాంఛనంగా 2022 ఫిబ్రవరిలోఆ దేశం ప్రవేశించింది. ప్రచ్ఛన్నయుద్ధం పరిసమాప్తమయ్యాక 90వ దశకం మొదట్లో అప్పుడే కొత్తగా ఏర్పడిన రష్యా ఫెడరేషన్‌కు నాటో కూటమి ఒక విస్పష్టమైన హామీ ఇచ్చింది. తాము తూర్పు దిశగా 'ఒక్క అంగుళం' కూడా ముందుకు రాబోమన్నదే దాని సారాంశం. కానీ అందుకు భిన్నంగా 2004లో రష్యా సరిహద్దుల్లోని బాల్టిక్ దేశాలైన ఈస్తోనియా, లాత్వియా, లిథుయేనియాలను నాటో చేర్చుకుంది. 2008లో ఉక్రెయిన్, జార్జియాలను ఆహ్వానించింది. ఈ ప్రయత్నం ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దారితీసే ప్రమాదమున్నదని రష్యాలో అప్పటి అమెరికా రాయబారి విలియమ్ బర్న్స్ ఆనాడే తన ప్రభుత్వానికి హెచ్చరిక సందేశం పంపారు. వికీలీక్స్ పత్రాల్లో ఇది బయటపడింది. నాటో విస్తరణకు ప్రయత్నిస్తే అది 'వినాశకరమైన తప్పిదం' అవుతుందని 1977లో సోవియెట్‌పై అమెరికా విధాన రూపశిల్పిగా వ్యవహరించిన జార్జి కెనన్ హెచ్చరించారు. ఇంతటి అత్యంత సున్నితమైన, ప్రమాదకరమైన అంశంలో యూరోప్ దేశాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. నాటో కూటమి ఇచ్చిన హామీకి సైతం ఎగనామం పెట్టి ఉక్రెయిన్‌ను ఉసి గొల్పాయి. తీరా అంతా తారుమారు కావటంతో సాయం కోసం అమెరికా వైపు చూశాయి.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన విక్టర్ యనుకోవిచ్ ప్రభుత్వాన్ని 2014లో కుట్రపూరితంగా కూలదోసి, పాశ్చాత్య అనుకూల కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో యూరోప్ దేశాలూ, వాటివెనకున్న అమెరికాలదే బాధ్యత. స్వతంత్రదేశంగా నాటోలో చేరాలో, వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉక్రెయిన్‌కి ఉండకూడదా అనేవాళ్లున్నారు. కానీ ఈ మాదిరే మెక్సికో లేదా కెనడా రష్యాతో చెట్టపట్టాలేసుకుంటే అమెరికా మౌనంగా ఉంటుందా? 1962లో క్యూబాలో సోవియెట్ అణుక్షిపణి మోహరించినప్పుడు అమెరికా సహించగలిగిందా? దాన్ని తొలగించేదాకా ఊరుకుందా? అబూదాబి చర్చల్లో యుద్ధ ఖైదీల మార్పిడికి అంగీకారం కుదిరింది. యూరోపియన్, నాటో కూటమి దూతల్ని కలవడానికి అక్కడ రష్యా నిరాకరించటం, అటు తర్వాత యూరోప్ చర్చల్లో పాల్గొనటానికి తాము వ్యతిరేకం కాదని పుతిన్ చెప్పడం ఆ దేశాల్లో భయాందోళనలు రేకెత్తించాయి. నాటో కొత్తగా ఏ దేశాన్నయినా చేర్చుకోరాదనీ, తూర్పు ప్రాంతంలోవున్న తమ దళాలనూ, అక్కడున్న సైనిక సామగ్రిని ఉపసంహరించాలనీ రష్యా కోరే ప్రమాదం ఉన్నదని అవి అనుమానిస్తున్నాయి. నిజానికి ఈ రెండూ గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనటానికి యూరోప్ దేశాలు ఇంతవరకూ చేసిన ప్రతిపాదనంటూ ఏమీ లేదు. ఉక్రెయిన్‌లోని డోన్బాస్ ప్రాంతంలోనూ, మరోరెండుచోట్లా రష్యా సేనలు వైదొలగాలన్నదే వాటి డిమాండ్. అన్నిటికీ ఒప్పుకుని రష్యా ఉపసంహరించుకుంటే 'భవిష్యత్తులో రష్యానుంచి ముప్పురాకుండా' ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వొచ్చన్నది వాటి ఎత్తుగడ. ఇందుకు బదులు ప్రచ్ఛన్నయుద్ధ పరిసమాప్తి తర్వాత రష్యాకిచ్చిన హామీ ఏమిటో గుర్తుతెచ్చుకుని విజ్ఞత ప్రదర్శించటం యూరోప్ దేశాలకే మంచిది. రెండు రోజులపాటు డబ్లిన్‌లో జరిగిన యూరోప్ శిఖరాగ్ర సమావేశంలో తమ తరఫున రెండో దశ చర్చల్లో పాల్గొనే ప్రతినిధిని ఎంపిక చేసుకోవటంలో అవి విఫలమయ్యాయి. ఇప్పటికైనా చిత్తశుద్ధి ప్రదర్శిస్తే ఉక్రెయిన్ శాంతి సాధ్యపడుతుంది. ఆలస్యమైనకొద్దీ లబ్ధిపొందేది రష్యానే అని యూరోప్ దేశాలు గుర్తుంచుకోవాలి.

వైట్ క్రాప్ టాప్‌లో గ్లామర్ ట్రీట్ ఇచ్చిన దిశా పటానీ!

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ సోషల్ మీడియాలో అడుగుపెడితే చాలు.. ఇంటర్నెట్ షేక్ అవ్వాల్సిందే. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేసే ఈ బ్యూటీ, తాజాగా ఆల్-వైట్ ఇండో-వెస్ట్రన్ ఫ్యూజన్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయింది. ఒకవైపు ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే, మరోవైపు తన మార్క్ గ్లామర్‌తో ఫ్యాన్స్‌కి అదిరిపోయే విజువల్ ట్రీట్ ఇచ్చింది. ఆ ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

ఆల్-వైట్ డ్రెస్‌లో అద్భుతమైన లుక్:

ఈ ఫోటోషూట్‌లో దిశా పటానీ వేసుకున్న వైట్ డ్రెస్ చాలా స్పెషల్‌గా ఉంది. సిల్వర్ వర్క్ చేసిన వైట్ క్రాప్ టాప్, దానికి మ్యాచింగ్‌గా ఫ్లోర్-లెంగ్త్ స్కర్ట్ ధరించింది. దీనిపైకి వేసుకున్న పొడవాటి నెట్ జాకెట్, చేతులకు ఉన్న ఎంబ్రాయిడరీ డిజైన్ ఆమె లుక్‌కి మరింత గ్రేస్ తీసుకొచ్చాయి. లైట్‌గా వేవ్స్‌లా వదిలేసిన జుట్టు, పింక్ ఇయర్ రింగ్స్‌తో దిశా పటానీ అచ్చం ఏంజెల్‌లా మెరిసిపోతోంది.

తెరపై హాట్.. బయట మాత్రం చాలా సిగ్గరి:

సినిమాల్లో బోల్డ్ క్యారెక్టర్లు, అదిరిపోయే డ్యాన్స్ స్టెప్పులతో దిశా రచ్చ చేస్తుంటుంది. కెమెరా ఆన్ అయితే చాలు తనలోని గ్లామర్ యాంగిల్ బయటకు వస్తుంది. కానీ రియల్ లైఫ్‌లో తను చాలా సిగ్గరి అని దిశానే స్వయంగా చాలాసార్లు చెప్పింది. ఇక పబ్లిక్ ఈవెంట్స్‌లో నలుగురి ముందు మాట్లాడాలంటే ఇప్పటికీ తనకు కొంచెం మొహమాటం అని ఆమె గతం లో తెలిపారు.

టైగర్ ష్రాఫ్ ఇంటి వద్ద దిశా సందడి!:

ఇక పర్సనల్ విషయాలకు వస్తే.. రీసెంట్‌గా హీరో టైగర్ ష్రాఫ్‌పై దాడి జరిగిన కొన్ని గంటల్లోనే దిశా ఆయన ఇంటికి వెళ్లింది. వైట్ టాప్, బ్లూ జీన్స్ వేసుకుని, చేతిలో ఒక కేర్ ప్యాకేజీ పట్టుకుని టైగర్ ఇంటికి వెళ్తున్న వీడియో బయటకు రావడంతో, వీళ్లిద్దరి మధ్య ఉన్న బాండింగ్‌పై మళ్లీ చర్చ మొదలైంది.

ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న బ్లాక్‌బస్టర్:

ఇక మరోవైపు కెరీర్ పరంగానూ దిశా ఫుల్ ఫామ్‌లో ఉంది. ఇమ్రాన్ హష్మీతో కలిసి ఆమె నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ దగ్గర 200 కోట్లకు పైగా వసూలు చేసి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇటీవల అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజైన ఈ సినిమా, ఎలాంటి అంచనాలు లేకుండానే మొదటి రోజు నుంచే నంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది.ఇక మొత్తానికి ఒకవైపు 200 కోట్ల బ్లాక్‌బస్టర్ సినిమాతో, మరోవైపు ఈ వైట్ డ్రెస్ ఫోటోషూట్‌తో దిశా పటానీ వార్తల్లో నిలుస్తోంది. గ్లామర్ విషయంలో తనకు తిరుగులేదని మరోసారి ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ, రాబోయే 'ఆవారాపన్ 2' సినిమాతో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



నటి సాయి పల్లవి కోయంబత్తూరులో సుమారు రూ.8 కోట్ల విలువైన ఇంటిని సంప్రదాయ దక్షిణ భారతీయ

లగ్జరీ కంటే ప్రశాంతతే ముఖ్యం.. సాయి పల్లవి ఇంటి ప్రత్యేకత ఇదే!

శైలిలో నిర్మించుకున్నట్లు సమాచారం. ఆధునిక హంగులు, ఖరీదైన అలంకరణలకు దూరంగా సాధారణ ఫర్నిచర్, కుటుంబ ఫొటోలు, పచ్చని మొక్కలతో ఇంటిని అందంగా తీర్చిదిద్దారు. విశాలమైన లివింగ్ రూమ్, సహజమైన వెలుతురు వచ్చే బెడ్‌రూమ్‌లు, ప్రత్యేక పూజా గది ఈ ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్టార్‌డమ్ ఉన్నప్పటికీ విలాసాల కంటే కుటుంబ బంధాలు, సంప్రదాయాలు, ప్రశాంతమైన జీవనానికి సాయి పల్లవి ప్రాధాన్యమివ్వడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది.




త్రివిక్రమ్ గారూ.. పాత తరహా సినిమాలే తీయండి సార్!

ఒకప్పుడు అద్భుతమైన కథలు, ఆలోచింపజేసే మాటలు, గుర్తుండిపోయే డైలాగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న త్రివిక్రమ్‌పై ఇప్పుడు అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. 'జల్సా', 'ఖలేజా', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అరవింద సమేత' వంటి సినిమాల్లో ఆయన రాసిన సంభాషణలు ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తున్నాయి. అయితే ఇటీవలి సినిమాల్లో ఆ స్థాయి కంటెంట్, డైలాగులు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో చేయనున్న 'గాడ్ ఆఫ్ వార్' సినిమాతోనైనా తన పాత శైలిని తిరిగి తీసుకురావాలని అభిమానులు కోరుకుంటున్నారు. యాక్షన్ కంటే బలమైన కథకు ప్రాధాన్యమివ్వాలని, తమకు స్ఫూర్తినిచ్చే త్రివిక్రమ్ సినిమాలు మళ్లీ చూడాలని సోషల్ మీడియాలో అభిప్రాయపడుతున్నారు.



అర్ధరాత్రి ఫోన్ చూస్తే విక్కీ వార్నింగ్.. కత్రినా ఆసక్తికర వ్యాఖ్యలు!

నటి కత్రినా కైఫ్ తన భర్త విక్కీ కౌశల్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సినిమాలు, వ్యాపార బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా తన ఆరోగ్యం, విశ్రాంతి విషయంలో విక్కీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. రాత్రిపూట నిద్రపోయే సమయంలో ఫోన్ చూడొద్దని, సెలవు రోజుల్లో పనిని పక్కన పెట్టి కుటుంబంతో గడపాలని సూచిస్తుంటారని చెప్పారు. పని ఒత్తిడి, ఆందోళనల మధ్య తనకు ప్రశాంతతను అందించే వ్యక్తి విక్కీయేనని కత్రినా ప్రశంసించారు.



డిసెంబర్ సెంటిమెంట్‌పై బాలయ్య ఆశలు.. 'దాదా'తో హిట్ కొడతారా?

బాలకృష్ణకు డిసెంబర్ నెల గతంలో విజయాలు, పరాజయాలు రెండింటినీ అందించింది. 'లారీ డ్రైవర్', 'అఖండ' వంటి సినిమాలు మంచి విజయాలు సాధించగా.. 'రూలర్', 'అఖండ 2' నిరాశపరిచాయి. ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దాదా' డిసెంబర్ 24న విడుదలకు సిద్ధమవుతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహారెడ్డి' హిట్ కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. 1980ల ముంబై గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబర్ సెంటిమెంట్‌ను బాలయ్యకు మళ్లీ కలిసొచ్చేలా చేస్తుందా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com